Follow: @ANNTELUGU
03-11-2025
ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్   సంపుటి- 22   సంచిక- 315   పేజీలు-08   వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI   REGISTERED NUMBER: APTEL/2003/09316   WWW.EPAPER.MAHAADAILY.COM



## నింగిలోకి బాహుబలి రాకెట్

### సీఎంఎస్ 03 ప్రయోగం సక్సెస్

భారత్ ప్రవేశపెట్టిన ఉపగ్రహాల్లో ఇదే అతిపెద్దది

సముద్ర వాతావరణ పరిస్థితులను తెలుసుకునే వెసులుబాటు

దాదాపు 15 ఏళ్లు సేవలు అందించేలా రూపొందించాం: ఇస్రో చైర్మన్ వీ నారాయణన్

వివరాలు 2లో

**టాప్ న్యూస్**

## హైడ్రాలో బీఆర్ఎస్ కోవర్టులు

- జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు

02



## దమ్ముంటే సన్నబియ్యం పథకం ఆపండి

- మజ్లిస్ ఓట్ల కోసమే బీజేపీపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఫైర్


02




## నీ అక్రమాలు త్వరలోనే బయటపెడతా...

- ఇద్దరి ఆస్తులపై విచారణకు సిద్ధమా?
- ఎమ్మెల్యే మాధవరంకు అరికెపూడి గాంధీ బహిరంగ సవాల్

02





# గెలిచి తీరాల్సిందే..

### నవీన్ యాదవ్‌కు ప్రతీ డివిజన్‌లో భారీ మెజారిటీ రావాలి

సర్వేలు మనకే అనుకూలం.. కొత్త కార్యక్రమాలతో ముందుకెళ్ళండి

ప్రచార వ్యూహం మార్చండి.. ప్రతి గడపకూ చేరండి

జూబ్లీహిల్స్ పై సీఎం రేవంత్ రెడ్డి కీలక సమీక్ష.. నేతలకు దిశానిర్దేశం

**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక లో ఖచ్చితంగా గెలిచి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశాకు. ఆదివారం మధ్యాహ్నం మంత్రులు, జూబ్లీహిల్స్ బైపోల్ ఇన్ చార్జిలతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, అజారుద్దీన్, వాకిటి శ్రీహరి, సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు సుదర్శన్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. మంత్రులు, పార్టీ నేతలతో లంచ్ మీటింగ్‌లో పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో సోమవారం నుంచి కొత్త కార్యక్రమాలతో ముందుకు వెళ్లాలని సీఎం సూచించారు. పోలింగ్ బూత్ లెవెల్‌లో ఓటరును నేరుగా కలిసే కార్యక్రమాన్ని రూపొందించాలని మంత్రులని ఆదేశించారు. పోలింగ్ బూత్ లెవెల్‌లో ఇన్‌ఫ్లుయెన్సర్స్‌తో నియోజకవర్గ ఇబ్బందులను వీడియోలుగా చేయించాలని నిర్దేశించారు. బూత్ స్థాయిలో కీలకమైన వ్యక్తుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ప్రచార వేగాన్ని మరింతగా పెంచాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. సర్వేలు తమకి అనుకూలంగా ఉన్నాయని వివరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ మెజారిటీ పెంచే అంశంపై మంత్రులు దృష్టి పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ స్థానాన్ని గెలిచి తీరాల్సిందేనని నేతలకు దిశానిర్దేశం చేశారు. డివిజన్ల వారీగా తాజా పరిస్థితిపై చర్చించారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని, ప్రజలు స్పష్టంగా ప్రభుత్వం వైపే ఉన్నారన్నారు. మైనారిటీలతో పాటు అన్నివర్గాలు కాంగ్రెస్ కు అండగా నిలుస్తున్నాయన్నారు. ప్రత్యర్థిపార్టీలు కన్ ఫ్యూజన్ తో, విషప్రచారంతో గెలవాలని కుట్రలు చేస్తున్నాయని వీటిని ఎప్పటికపుడు తిప్పికొడుతూ దూసుకువెళ్ళాలన్నారు. సర్వేలు అనుకూలంగా ఉన్నాయని, నవీన్ యాదవ్ కు భారీ మెజారిటీ తీసుకువచ్చేందుకు అందరూ పనిచేయాలన్నారు.



## ఒక్క భవనం.. రెండు పార్టీలు

### మణుగూరులో హైటెన్షన్

### బీఆర్ఎస్ ఆఫీస్‌పై కాంగ్రెస్ శ్రేణుల దాడి

ఫ్లెక్సీలు చించి, ఫర్నీచర్‌ను తగలబెట్టిన వైనం

మా ఆఫీసు ఆక్రమించారు.. స్వాధీనం చేసుకుంటున్నామన్న కాంగ్రెస్ నేతలు

వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.. ఎవరిని వదిలే ప్రసక్తే లేదు: రేగా కాంతారావు

మణుగూరు దాడిపై కేటీఆర్ ఫైర్ .. మణుగూరు శ్రేణులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా

**మణుగూరు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ కేంద్రం మణుగూరులో ఆదివారం కాంగ్రెస్, బిఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణాత్మక పరిస్థితి నెలకొంది. ఏడు సంవత్సరాలుగా బిఆర్ఎస్ (మాజీ టిఆర్ఎస్) ఆధీనంలో ఉన్న పార్టీ కార్యాలయాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు మళ్లీ స్వాధీనం చేసుకున్నారు. నాటి ఎమ్మెల్యే రేగా కాంతారావు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆక్రమించి తెలంగాణ భవన్ గా మార్చిన ఘటనకు ఇది ప్రతిస్పందనగా మారింది.

మిగతా 2లో



## చరిత్ర సృష్టించిన భారత్

- మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకున్న భారత జట్టు
- ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో ఘన విజయం
- సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేష్, కేటీఆర్ అభినందనలు

03

## ట్రంప్‌ను నిలదీసే ధైర్యం మోడీకి ఉందా?

### ఓట్ల కోసం ఏం చేయడానికైనా వెనకాడబోరు

మోదీపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సెటైర్లు



**బీహార్, మహా:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి ప్రధానిపై విమర్శలు చేశారు. ఆదివారం బిహార్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్ మాట్లాడుతూ.. ఓట్ల కోసం ప్రధాని మోదీ ఏం చేయడానికైనా వెనకాడబోరని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ బిహార్‌కు వచ్చి అనేక ప్రసంగాలు, వాగ్దానాలు చేస్తారని.. ఎన్నికల తర్వాత రాష్ట్రం వైపు కన్నెత్తి కూడా చూడరని రాహుల్ విమర్శించారు.


మిగతా 2లో

## మళ్లీ సిర్పూర్ నుండే పోటీ చేస్తా..

- ఆర్ఎస్పీ సంచలన వ్యాఖ్యలు
- సిర్పూరు ప్రజలు నన్ను తమ ఎమ్మెల్యేగా చూడాలనుకుంటున్నారు

02




## పేదలకో న్యాయం... పెద్దలకో న్యాయం

### హైడ్రా అరాచకాలపై కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

500 రోజుల్లో అధికారం మాదే.. హైడ్రా బాధితులకు న్యాయం చేస్తాం

**హైదరాబాద్, మహా :** చట్టం అందరికీ సమానమే అయినప్పటికీ కాంగ్రెస్ పాలనలో పేదలకు మాత్రమే చట్టం అన్నట్లుగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పెద్దవాళ్లకు ఒక న్యాయం.. పేదవాళ్లకు ఒక న్యాయం నినాదంతో తెలంగాణ భవన్‌లో ఆదివారం ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో హైడ్రా అరాచకాలపై కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.


మిగతా 2లో



## హైదరాబాద్ మేయర్‌కు కాంగ్రెస్ కీలక బాధ్యతలు

బైపోల్ కోసం కో ఆర్డినేషన్ కమిటీ.. ఛైర్ పర్సన్ గా విజయలక్ష్మి

02




బిఆర్ఎస్ శ్రేణులకు నచ్చచెప్తున్న సీఐ నాగబాబు


బందోబస్తు చర్యలు చేపడుతున్న డిఎస్పి రవీందర్ రెడ్డి


కార్యాలయానికి రంగులు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

# ఒక్క భవనం.. రెండు పార్టీలు

## మణుగూరులో హైటెన్షన్

### బీఆర్ఎస్ ఆఫీస్‌పై కాంగ్రెస్ శ్రేణుల దాడి

ఫ్లెక్సీలు చించి, ఫర్నీచర్‌ను తగలబెట్టిన వైనం

మా ఆఫీసు ఆక్రమించారు.. స్వాధీనం చేసుకుంటున్నామన్న కాంగ్రెస్ నేతలు

వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.. ఎవరిని వదిలే ప్రసక్తే లేదు: రేగా కాంతారావు

మణుగూరు దాడిపై కేటీఆర్ ఫైర్ .. మణుగూరు శ్రేణులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా


కదం తొక్కిన కాంగ్రెస్ శ్రేణులు

(మొదటిపేజీ తరువాయి)

ఆదివారం ఉదయం వందలాది కాంగ్రెస్ కార్యకర్తలు ప్రదర్శనగా తెలంగాణ భవన్ వైపు కదం తొక్కారు. కార్యాలయంలో ఉన్న బిఆర్ఎస్ నాయకులు ప్రతిఘటించడంతో స్వల్ప ఘర్షణ జరిగింది. ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం ఆగ్రహంతో ఉవ్వెత్తున లేచిన కాంగ్రెస్ శ్రేణులు కార్యాలయ ఫర్నిచర్‌ను బయటకు విసిరి దగ్ధం చేశారు. తర్వాత బోర్డుకు రంగులు వేసి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం అనే ఫ్లెక్సీ కట్టి, జెండాలు ఎగురవేశారు. జై కాంగ్రెస్ నినాదాలతో టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కడంతో డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ నాగబాబు పరిస్థితిని శాంతింపజేశారు. మణుగూరులో 144సెక్షన్ విధించారు. అనూహ్యదాడితో బీఆర్ఎస్ షాక్ కు గురైంది. గత కొద్దిరోజులుగా కాంగ్రెస్ ను రెచ్చగొడుతున్న రేగా కాంతారావుకు.. తమ కార్యాలయాన్ని హస్తగతం చేసుకుంటామంటూ నేరుగా కాంగ్రెస్ శ్రేణులు వెళ్ళి షాకిచ్చాయి. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సైలెంట్ గా రేగాకు షాకిచ్చారు.

**భౌతిక దాడులు పిరికి పందల చర్య**

భద్రాద్రి కొత్తగూడెం మణుగూరు పట్టణంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చేసిన దాడిని ఖండిస్తూ పినపాక నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతరావు సోషల్ మీడియా వేదికగా హాట్ కామెంట్స్ చేశారు. భౌతిక దాడులకు భయపడేది లేదని.. ఎంత రెచ్చగొడితే అంత ఎక్కువ ప్రశ్నిస్తామన్నారు. ఫ్లెక్సీ కట్టినంత మాత్రాన అయ్యేదేంటని.. కాలమే నిర్ణయిస్తుందని చెప్పారు. ఎవరులేని సమయాన భౌతిక దాడులు చేయడం సిగ్గుపడాల్సిన చర్య అని పేర్కొన్నారు. భౌతిక దాడులు పిరికి పందల చర్య అని మండిపడ్డారు. కార్యకర్తలు సమన్వయం పాటించాలని.. భవిష్యత్ తమదేనన్నారు. మణుగూరు పార్టీ ఆఫీస్ పై కాంగ్రెస్ గుండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. ఎవరిని వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

**ఖండించిన కేటీఆర్**

మణుగూరు బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనను తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో గూండాల రాజ్యం, రౌడీయిజం పెరిగిపోయిందని కేటీఆర్ మండిపడ్డారు. సంఘటన సమాచారం తెలుసుకుని జిల్లా పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావుతో ఫోన్‌లో మాట్లాడారు. 60 లక్షల భారత రాష్ట్ర సమితి కుటుంబమంతా మణుగూరు పార్టీ శ్రేణులకు తోడుగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని అన్నారు. త్వరలోనే మణుగూరును సందర్శిస్తానని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రౌడీ మూకలకు, వారి అరాచకత్వానికి భయపడాల్సిన అవసరం లేదని కేటీఆర్ అన్నారు. రాష్ట్ర రాజధాని నుంచి మొదలుకుని గ్రామ స్థాయి వరకు కాంగ్రెస్ పాలనలో ప్రతిచోటా రౌడీల రాజ్యం నడుస్తోందని, అరాచకత్వం కొనసాగుతోందని, దీనికి చరమగీతం పాడే రోజు దగ్గర్లో ఉందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.


ఘర్షణలో గాయపడిన బిఆర్ఎస్ కార్యకర్త

## హైడ్రాలో బీఆర్ఎస్ కోవర్టులు

**జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**హైద్రాబాద్, మహా:** హైడ్రా అధికారులపై కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సీరియస్ అయ్యారు. ఆదివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. కొందరు హైడ్రా అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చే కుట్రలో భాగంగా ఓవరాక్షన్ చేస్తున్నారని అన్నారు. వారి ప్రవర్తన బీఆర్ఎస్‌కు లాభం చేకూరేలా ఉందని అనుమానం వ్యక్తం చేశారు. అలాంటి అధికారులపై హైడ్రా చీఫ్ రంగనాథ్ దృష్టి పెట్టాలని సూచించారు. కేటీఆర్ కూడా హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు.. దీనిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత అధికారులపై కూడా ఉందని అన్నారు. కేవలం ఎన్నికలు వచ్చినప్పుడే కేటీఆర్‌కు హైడ్రా గుర్తుకు వస్తోందని జగ్గారెడ్డి విమర్శలు చేశారు. ఇన్ని రోజులు హైడ్రా కూల్చివేతలపై కేటీఆర్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అనుకూల హైడ్రా అధికారుల వల్ల ఎవరైనా నష్టపోతే సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకువెళ్తాని అన్నారు. హైడ్రా అంశం తెరపైకి తెచ్చి జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్‌ను ఓడించేందుకు కుట్ర చేస్తున్నారని కీలక వ్యాఖ్యలు చేశారు.

## నింగిలోకి బాహుబలి రాకెట్

**సీఎంఎస్ 03 ప్రయోగం సక్సెస్**

- భారత్ ప్రవేశపెట్టిన ఉపగ్రహాల్లో ఇదే అతిపెద్దది
- సముద్ర వాతావరణ పరిస్థితులను తెలుసుకునే వెసులుబాటు
- దాదాపు 15 ఏళ్లు సేవలు అందించేలా రూపొందించాం: ఇస్రో చైర్మన్ వీ నారాయణన్

**హైదరాబాద్, మహా:** భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రయోగించిన సీఎంఎస్03 ప్రయోగం విజయవంతమైంది. బాహుబలి రాకెట్ ఎల్‌వీఎం3ఎం5 రాకెట్ కమ్యూనికేషన్ శాటిలైట్‌ను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టింది. సీఎంఎస్03 సమాచార ఉపగ్రహం బరువు 4410 కిలోలు. ఇప్పటి వరకు భారత్ ప్రవేశపెట్టిన ఉపగ్రహాల్లో అన్నింటికంటే ఇదే అతిపెద్దది కావడం విశేషం. ఏపీలోని శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి ఆదివారం సాయంత్రం 5.26గంటలకు రాకెట్‌ను ఇస్రో నింగిలోకి పంపింది. దాదాపు అరగంటకుపైగా ప్రయోగించిన రాకెట్ విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టినట్లుగా ఇస్రో ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రయోగం విజయవంతం అవడంపై ఇస్రో చైర్మన్ వీ నారాయణన్ శాస్త్రవేత్తలను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రయోగం విజయవంతం కావడం ఆనందంగా ఉందన్నారు. విజయంలో కీలకపాత్ర పోషించిన అందరికీ ధన్యవాదాలు చెప్పారు. ఈ ప్రయోగంతో భారత్ మరో ఘనత సాధించిందని తెలిపారు.

**ఆత్మనిర్భర్ దిశగా ఇస్రో అడుగులు..**

శాస్త్రవేత్తలు, సిబ్బంది కృషితోనే ఇదంతా సాధ్యమైందని పేర్కొన్నారు. చంద్రయాన్3 చంద్రుని దక్షిణ ధ్రువంలో దిగడంతో ఎల్‌వీఎం3 భారత్‌కు కీర్తిని తెచ్చిపెట్టిందని.. నేడు అత్యంత బరువైన ఉపగ్రహాన్ని విజయవంతంగా మళ్లీ విజయాన్ని సాధించిందన్నారు. ఈ మిషన్ కోసం రాకెట్ పనితీరుతో పాటు పేలోడ్ సామర్థ్యాన్ని పెంచాల్సి వచ్చిందన్నారు. ఈ శాటిలైట్ మల్టీబ్యాండ్ కమ్యూనికేషన్ ఉపగ్రహమని.. దాదాపు 15 సంవత్సరాలు సేవలు అందించేలా రూపొందించామన్నారు. ఈ ఉపగ్రహం సరికొత్త సాంకేతిక టెక్నాలజీతో రూపొందించామన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌కు అద్భుతమైన ఉదాహారణ అని.. ఆత్మనిర్భర్ దిశగా ఇస్రో అడుగులు వేస్తోందని చెప్పారు. అన్నారు. కీలకమైన, సంక్లిష్టమైన ఉపగ్రహాన్ని తయారు చేసిన శాస్త్రవేత్తలు, సిబ్బంది బృందాన్ని తెలుపుతున్నానన్నారు. ప్రయోగ సమయంలో కఠినమైన, సవాల్‌తో కూడుకున్నదని.. వాతావరణం అంతగా సహకరించలేదన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరినీ అభినందించేందుకు ఉన్న ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నానన్నారు.




## పేదలకో న్యాయం... పెద్దలకో న్యాయం

**హైడ్రా అరాచకాలపై కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్**

500 రోజుల్లో అధికారం మాదే.. హైడ్రా బాధితులకు న్యాయం చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

రాబోయే 500 రోజుల్లో తిరిగి కేసీఆర్ ప్రభుత్వం వస్తుందని, హైడ్రా వల్ల అన్యాయానికి గురైన బాధితులకు న్యాయం చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు ఎంతో మంది బాధితులుగా మారారన్నారు. కేసీఆర్ హయాంలో ఎక్కడ చూసినా కట్టడాలే కనిపిస్తే కాంగ్రెస్ హయాంలో కూల్చి వేతలే కనిపిస్తున్నాయని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోనే లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించామని, వైట్ హౌస్‌ను తలదన్నేలా సచివాలయం కట్టామని, దేశంలోనే అతిపెద్ద పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ కట్టుకున్నామన్నారు. హైదరాబాద్‌లో 42 ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, ప్రతి జిల్లాలో కలెక్టరేట్ లు కట్టుకున్నామని వివరించారు. నీటి ప్రాజెక్టులు కట్టుకున్నాం. ఒకటి రెండు కాదు.. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ కొత్త నిర్మాణాలు చేసుకున్నామని కేటీఆర్ గుర్తు చేశారు.

కాంగ్రెస్ ఈ రెండేళ్లలో ఒక్క ఇటుక పెట్టలేదన్నారు. రెండేళ్లలో రేవంత్ రెడ్డి చేసింది ఏంటంటే కూలగొట్టడమే అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల జరిగిన అన్యాయానికి ఎంతో మంది బాధితులుగా మారారని, 500 రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వం రానుంది, మా ప్రభుత్వం రాగానే ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామన్నారు. ఇంత అన్యాయంగా, కిరాతకంగా పనిచేయాలని ఎవరూ కోరుకోరని, పేదవాడికి ఒక న్యాయం.. ఉన్నవాడికి ఒక న్యాయం.. ఇది ఈ ప్రభుత్వ పనితీరు అని దుయ్యబట్టారు. హైడ్రాపై భట్టి విక్రమార్క పెద్ద ప్రజంటేషన్ ఇచ్చారంటూ ఆ రోజు భట్టి ఇచ్చిన ప్రజంటేషన్‌లో చాలా విషయాలు చెప్పారన్నారు. చాలా బిల్డర్ల పేర్లు చెప్పారు కానీ.. మేం ఏ బిల్డర్‌ను ఇబ్బంది పెట్టదలుచుకోలేదని స్పష్టం చేశారు. పేదవాడి ఇంటికి వచ్చిన బుల్డోజర్ ఆ బిల్డర్ల జోలికి ఎందుకు వెళ్లలేదో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. పేదలు కోరుకునేది ఒక్కటే కూడు గూడు గుడ్డ.. అలాంటి పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చేయడం దారుణమన్నారు. ప్రభుత్వానికి అంతా సమానమైతే పెద్ద వాళ్ల జోలికి ఎందుకు వెళ్లలేదని నిలదీశారు. పేదల ఇళ్లు కూలగొట్టలేదని హైడ్రా కమిషనర్ చెబుతున్నారని పేర్కొంటూ పేపర్లు, కోర్టు తీర్పులు ఉన్నా కూడా టైమ్ ఇస్తే కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకుంటారని చెబుతున్నారని మండిపడ్డారు. ఫుల్ ట్యాంక్ లెవల్లో కడితే ఎవరిని వదలం అని చెప్పి పెద్దలను వదిలేశారన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెరువును పూడ్చి ఇల్లు కట్టారని కేటీఆర్ పేర్కొన్నారు. రెవెన్యూ మంత్రి ఇంటికి వెళ్లే ధైర్యం హైడ్రా కమిషనర్ చేస్తారా? మరో మంత్రి వివేక్ కూడా హిమాయత్ సాగర్ చెరువు వద్ద ఇల్లు కట్టుకున్నారు. వీళ్లను ముట్టే ధైర్యం హైడ్రా చేస్తుందా? రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ లోపల ఇల్లు కట్టుకున్నారు. సున్నం చెరువులో ఇల్లు కట్టుకున్న పేదలది తప్పు దుర్గం చెరువులో కట్టిన తిరుపతి రెడ్డిది ఏ తప్పులేదా అని నిలదీశారు. పేదలకు అసలు టైమ్ ఇవ్వరు కానీ తిరుపతి రెడ్డికి టైమ్ ఇచ్చి కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకునేలా చేసింది వాస్తవం కాదా అని అడిగారు.

ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి చెరువు మధ్యలోనే ఇల్లు కట్టుకున్నారు. ఆయనకు నోటీసులు ఇచ్చే ధైర్యం హైడ్రాకు ఉందా? మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి చెరువులోనే ఇల్లు కట్టుకున్నారు వాళ్ల దగ్గరకు వెళ్లి.. వారికి నోటీసులు ఇచ్చే దమ్ము అధికారులకు ఉందా? పెద్ద పెద్ద ఫామ్ హౌజ్‌లు, ఇల్లులు కట్టుకున్నా అడిగేవారు లేరని కేటీఆర్ మండిపడ్డారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ.. గాజులరామారంలో 11 ఎకరాలకు ప్రభుత్వమే అండగా ఉందన్నారు. పేదలను వెళ్లగొట్టి గాంధీకి మాత్రం అండగా నిలిచారన్నారు. మాకు హద్దులు చూపించడం లేదు.. హద్దులు విషయంలో ఇబ్బందులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. కాంగ్రెస్‌లో చేరితే ఒక న్యాయం.. ఇతరులకు మరో న్యాయం ఉంటుందా? ఈ షీట్‌లు వేసింది కూడా అధికారులే అని కేటీఆర్ తెలిపారు. కొండాపూర్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకున్న కొందరికి ప్లాట్లు ఇచ్చారు. వారిని కూడా హైడ్రా వెళ్లగొట్టింది. హైడ్రా చేసేది న్యాయమే అయితే.. అర్ధరాత్రి ఎందుకు వస్తున్నట్లు? నోటీసులు ఇవ్వడానికి ప్రభుత్వానికి ఏంటి ఇబ్బంది? పేపర్లు చూడటానికి ఏం ఇబ్బంది ఉంది? ఇదే రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూలగొట్టడం తప్పు అని మాట్లాడారు. తప్పు జరిగితే రెగ్యులరైజ్ చేయండి అని చెప్పంది కూడా రేవంత్ రెడ్డే. ఆర్మీ కుటుంబాన్ని కూడా ప్రభుత్వం ఇబ్బంది పెట్టింది. తెలియక తప్పు జరిగితే సరిదిద్దాలని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎందుకు కూలగొడుతున్నారని ప్రశ్నించారు.

## ట్రంప్‌ను నిలదీసే ధైర్యం మోడీకి ఉందా?

**ఓట్ల కోసం ఏం చేయడానికైనా వెనకాడబోరు**

మోదీపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సెటైర్లు

(మొదటిపేజీ తరువాయి)

బిహార్‌లో ప్రధాన సమస్యగా ఉన్న నిరుద్యోగం గురించి ప్రశ్నలు లేవనెత్తకుండా.. యువత దృష్టిని మళ్లించడానికి వారిని రీల్స్ చూడాలని మోదీ కోరుతున్నారని రాహుల్ అన్నారు. రాష్ట్రంలో తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు ఉత్తమ విద్య, ఉద్యోగ అవకాశాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన రోజు నలంద వంటి ప్రఖ్యాత విశ్వవిద్యాలయాన్ని బిహార్‌లో ప్రారంభిస్తామన్నారు. భారత్‌పాక్ సైనిక ఘర్షణను ఆపానని ట్రంప్ పదేపదే చెబుతున్నప్పటికీ.. ఆయనను నిలదీసి ప్రశ్నించే ధైర్యం మోదీకి లేదని విమర్శించారు. మోదీ ప్రభుత్వం తీసుకున్న నోట్ల రద్దు, జీఎస్టీ సంస్కరణలు వంటి నిర్ణయాలన్నీ దేశంలోని కొందరు వ్యాపారవేత్తలకు ప్రయోజనం చేకూర్చేవేనన్నారు. కానీ తాము మాత్రం చిరు వ్యాపారులు అభివృద్ధి చెందాలనే ఆలోచనతో ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర పరికరాలపై మేడిన్ బిహార్ అనే ముద్రను చూడాలనుకుంటున్నామన్నారు. కాగా ప్రచారం సందర్భంగా ఓ చెరువు వద్దకు వెళ్ళి మత్స్య కారులతో మాట్లాడిన రాహుల్ చెరువులోకి దూకి వారితో కలిసి చేపలు పట్టడం వైరల్ గా మారింది.

## నీ అక్రమాలు త్వరలోనే బయటపెడతా

**ఎమ్మెల్యే మాధవరంకు అరికెపూడి గాంధీ బహిరంగ సవాల్**

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అక్రమాలు త్వరలోనే బయట పెడతాను అని అరికెపూడి గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. పరస్పర విమర్శలకు దిగడంతో రాజకీయ వేడి రాజుకుంది. ఈ క్రమంలోనే కృష్ణారావుకు, అరికెపూడి గాంధీ బహిరంగ సవాల్ విసిరారు. ఇద్దరి ఆస్తులపై విచారణకు సిద్ధమా?అని నిలదీశారు. తాను రాజకీయాల్లోకి వచ్చాక భూమి కొనుగోలు చేయలేదని స్పష్టం చేశారు.“ 2008లో నా భూమి ఎస్‌ఎఫ్‌సీ భూముల్లో ఉందని ఆరోపణలు వచ్చాయి. నా భూమికి ఎస్‌ఎఫ్‌సీ భూమికి సంబంధం లేదని ఆ తర్వాత హైకోర్టు స్పష్టం చేసింది. ఎమ్మెల్యే కృష్ణారావు ఆరోపణల్లో వాస్తవం లేదు. ఈ విషయంలో ఆయనతో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నా’ అని చెప్పారు.

## హైదరాబాద్ మేయర్‌కు కాంగ్రెస్ కీలక బాధ్యతలు

**బైపోల్ కోసం కో ఆర్డినేషన్ కమిటీ.. చైర్ పర్సన్ గా విజయలక్ష్మి**

**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ పలు వ్యూహాలు రచిస్తోంది. ఉపఎన్నిక కోసం కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదివారం నాడు ఈ మేరకు ఓ జాబితా విడుదల చేశారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉపఎన్నిక 2025 కోసం ఈ కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కమిటీకి చైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి (జీహెచ్ఎంసీ మేయర్), కోచైర్మన్‌గా ఎరవత్రి అనిల్ కుమార్ (మాజీ ఎంఎల్ఏ)లు నియమితులు. సభ్యులుగా సి. రోహిణ్ రెడ్డి (ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు), సమీర్ వల్లువుల్లా (హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు), మోతే శ్రీలతా శోభన్ రెడ్డి (జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్), పి. విజయారెడ్డి (జీహెచ్ఎంసీ కార్పొరేటర్), ఎం. రజితా పరమేశ్వర్ రెడ్డి (జీహెచ్ఎంసీ కార్పొరేటర్), బొంతు శ్రీదేవి (జీహెచ్ఎంసీ కార్పొరేటర్), బానోతు సుజాత (జీహెచ్ఎంసీ కార్పొరేటర్), మహాలక్ష్మి రామన్ గౌడ్ (జీహెచ్ఎంసీ కార్పొరేటర్), వి. పూజిత (జీహెచ్ఎంసీ కార్పొరేటర్), ఆర్. మంజుల (జీహెచ్ఎంసీ కార్పొరేటర్), బూరుగడ్డ పుష్ప (జీహెచ్ఎంసీ కార్పొరేటర్), పి. ఇందిరా శోభన్, రేగులపాటి రమ్యారావు, ఉజ్మా షకీర్ ఉన్నారు. ఈ కమిటీ ఉపఎన్నిక ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి, పార్టీ అభ్యర్థి విజయం కోసం పనిచేయనుంది.

## దమ్ముంటే సన్నబియ్యం పథకం ఆపండి

**మజ్లిస్ ఓట్ల కోసమే బీజేపీపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఫైర్**



**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఓటర్లను బెదిరింపులకు గురిచేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. సన్నబియ్యం పథకాన్ని ఆపేస్తామని ముఖ్యమంత్రి ప్రజలను భయపెడుతున్నారని, దమ్ముంటే ఆ పథకాన్ని ఆపి చూడాలని సవాల్ విసిరారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం మీడియా మాట్లాడుతూ సన్న బియ్యం పథకం కాంగ్రెస్‌ది కాదు. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న ఉచిత బియ్యం పథకంలో భాగమని పేర్కొన్నారు. ఈ పథకంలో కేంద్రం కిలో బియ్యానికి రూ. 42 భరిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నది కేవలం రూ. 15 మాత్రమే అని వివరించారు. ఈ వాస్తవాన్ని దాచిపెట్టి, పథకాన్ని ఆపేస్తామని బెదిరించడం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనని స్పష్టం చేశారు. ఓటు వేయకపోతే పథకాలు ఆపేస్తామని బెదిరించడంపై ఇప్పటికే బీజేపీ తరపున ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మజ్లిస్ ఓట్లను దక్కించుకోవడానికే కాంగ్రెస్ పార్టీ బీజేపీపై విమర్శలు చేస్తోందని కిషన్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా అమలు చేస్తున్న ఏకైక పథకం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మాత్రమేనని ఆయన ఎద్దేవా చేశారు. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి ప్రజలను బెదిరించేలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. బీజేపీని విమర్శించి మజ్లిస్ ఓట్లు పొందాలని కాంగ్రెస్ కొత్త కుట్రకు తెరలేపిందని మండిపడ్డారు. అమలుకు సాధ్యం కానీ హామీలు గుప్పించి.. దొడ్డి దారిన రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. హామీలన్నీ విస్మరించి ఒకే ఒక్క హామీని అమలు చేస్తున్నారు.. అదే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని అన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా జూబ్లీహిల్స్‌లో బీజేపీ గెలుపు ఖాయమని జోస్యం చెప్పారు.

# చరిత్ర సృష్టించిన భారత్

## మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకున్న భారత జట్టు

### ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో ఘన విజయం

### సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేష్, కేటీఆర్ అభినందనలు



**మహా :** భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. కోట్లాది మంది అభిమానుల ఆశలను నిజం చేస్తూ తొలిసారిగా ఐసీసీ మహిళల ప్రపంచకప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీ వేదికగా జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌లో షఫాలీ వర్మ అద్భుత ఇన్నింగ్స్‌కు, చివర్లో దీప్తి శర్మ ఆల్‌రౌండ్ ప్రదర్శన తోడవడంతో భారత్ జగజ్జేతగా నిలిచింది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ వీరోచిత సెంచరీ చేసినా, తన జట్టును గెలిపించలేకపోయింది. ఈ మెగా ఫైనల్‌లో టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా కెప్టెన్, ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు ఓపెనర్లు స్మృతి మంధన (45), షఫాలీ వర్మ (87) అద్భుతమైన శుభారంభం అందించారు. ముఖ్యంగా షఫాలీ తనదైన శైలిలో దూకుడుగా ఆడి కేవలం 78 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 87 పరుగులు చేసి భారీ స్కోరుకు పునాది వేసింది. వీరిద్దరూ తొలి వికెట్‌కు 104 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అనంతరం జెమీమా రోడ్రిగ్స్ (24), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (20) త్వరగానే వెనుదిరిగినా, ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (58) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో ఆదుకుంది. చివరి ఓవర్లలో వికెట్ కీపర్ రిచా ఘోష్ (24 బంతుల్లో 34) మెరుపులు మెరిపించడంతో భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 298 పరుగుల భారీ స్కోరు సాధించింది. సఫారీ బౌలర్లలో అయాబొంగా ఖాకా 3 వికెట్లు పడగొట్టింది. 299 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికాకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. అయితే, కెప్టెన్ లారా వోల్వార్ట్ (101) ఒంటరి పోరాటం చేసింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా, ఆమె మాత్రం అద్భుతమైన షాట్లతో భారత బౌలర్లపై ఒత్తిడి పెంచింది. కేవలం 98 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్సర్‌తో సెంచరీ పూర్తి చేసుకుంది. అయితే, మిగతా బ్యాటర్ల నుంచి ఆమెకు సరైన సహకారం అందలేదు. సఫారీ ఇన్నింగ్స్‌లో అనెరీ డెర్క్‌సెన్ (35) మినహా ఎవరూ రాణించలేకపోయారు. ఈ దశలో భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ బంతితో మ్యాజిక్ చేసింది. కీలకమైన వోల్వార్ట్ వికెట్‌తో సహా మొత్తం 5 వికెట్లు పడగొట్టి దక్షిణాఫ్రికా పతనాన్ని శాసించింది. ఆమె అద్భుతమైన బౌలింగ్‌కు సఫారీ బ్యాటర్లు నిలవలేకపోయారు. దీప్తికి తోడుగా షఫాలీ వర్మ కూడా 2 కీలక వికెట్లు తీసి తన ఆల్‌రౌండ్ సత్తాను చాటింది. దీంతో దక్షిణాఫ్రికా జట్టు 45.3 ఓవర్లలో 246 పరుగులకే ఆలౌట్ అయింది. ఫలితంగా భారత అమ్మాయిలు 52 పరుగుల తేడాతో చారిత్రక విజయాన్ని అందుకుని ప్రపంచకప్‌ను గర్వంగా ముద్దాడారు. కాగా తొలిసారి ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టుకు సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేష్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లు అభినందనలు తెలిపారు.



## పాట్నాలో మోదీ .. మోదీ

### మహిళల హారతులు.. ఉత్సవంలా రోడ్ షో

**పాట్నా:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం సాయంత్రం పాట్నా సిటీలో భారీ రోడ్‌షోలో పాల్గొన్నారు. రోడ్డుకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో జనం ప్రధానికి ఘన స్వాగతం పలికారు. బీజేపీ జెండాలు పట్టుకుని 'మోదీ.. మోదీ' అంటూ నినాదాలు హోరెత్తించారు. భారీ భద్రతతో ప్రధాని కాన్వాయ్ ముందుకు సాగగా, పలువురు ప్రధానిపై పూలజల్లులు కురిపించారు. మహిళలు హారతులు పట్టారు. రోడ్‌షో పండుగ ఉత్సవాన్ని సంతరించుకుంది. దీనికి ముందు నవడలో జరిగిన భారీ ర్యాలీలో ప్రధాని పాల్గొన్నారు. ప్రజల ఉత్సాహం చూస్తుంటే మరోసారి ఎన్డీయే గెలుపు ఖాయమని తాను చెప్పగలనని మోదీ అన్నారు. ఎన్డీయే చేపట్టిన అభివృద్ధి మోడల్‌పై ప్రజలకు ఉన్న విశ్వాసానికి ఇది చాటుతోందన్నారు.

## ఫీజు బకాయిల సమరం..

### నేటి నుంచి కాలేజీల నిరవధిక బంద్

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాల పోరుబాట

6న 2 లక్షల మంది అధ్యాపకులతో సభ.. 10న చలో హైదరాబాద్

**హైదరాబాద్, మహా:** ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదల ఆలస్యంపై తెలంగాణలోని ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య ప్రభుత్వానికి గట్టి అల్టిమేటం జారీ చేసింది. తమకు రావాల్సిన బకాయిల విషయంలో ప్రభుత్వం తక్షణమే ఒక స్పష్టమైన నిర్ణయం ప్రకటించకపోతే నేటి ుండి రాష్ట్రవ్యాప్తంగా కళాశాలలు నిరవధిక బంద్‌కు దిగుతాయని సమాఖ్య హెచ్చరించింది. విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపగల ఈ నిర్ణయంతో, ఇప్పుడు అందరి దృష్టి ప్రభుత్వం నేటి స్పందనపైనే నిలిచింది.

**తప్పనిసరి పరిస్థితుల్లోనే బంద్ నిర్ణయం..**

ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. దసరా పండుగకు ముందే ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.1,200 కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, కేవలం రూ.300 కోట్లు మాత్రమే విడుదల చేసిందని సమాఖ్య ఆరోపించింది. దీంతో, తమకు రావాల్సిన బకాయిలు పేరుకుపోవడంతో కళాశాలల నిర్వహణ భారంగా మారిందని, తప్పనిసరి పరిస్థితుల్లోనే బంద్ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని యాజమాన్యాలు పేర్కొన్నాయి. ఈ నిరసన కేవలం కళాశాలల మూసివేతతో ఆగదని సమాఖ్య స్పష్టం చేసింది. ఫీజు బకాయిలు పూర్తిగా చెల్లించే వరకు తాము కళాశాలలను తిరిగి తెరవబోమని తేల్చి చెప్పింది.

**6న 2 లక్షల మంది అధ్యాపకులతో సభ..**

ఈ నెల 6న హైదరాబాద్‌లో దాదాపు లక్షన్నర మంది కళాశాల సిబ్బంది, లెక్చరర్లతో భారీ సభ నిర్వహించాలని నిర్ణయించింది. ఈ బంద్‌తో వేలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయుల భవిష్యత్తు అనిశ్చితిలోకి నెట్టబడుతోంది. ఉన్నత విద్యాసంస్థల హెచ్చరిక నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం ఇవాళ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఉత్కంఠగా మారింది. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేసేందుకు ప్రభుత్వం ఒక రోడ్‌మ్యాప్‌ను ప్రకటిస్తుందా లేక యాజమాన్యాల ఆందోళనను నిరోధించేందుకు వేరే చర్యలు తీసుకుంటుందా అనేది చూడాలి. ఏదేమైనా, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య ఇప్పుడు విద్యారంగంలో ఒక తీవ్ర సంక్షోభానికి దారితీసే అవకాశం కనిపిస్తోంది.

## కాంగ్రెస్ నీచ సంస్కృతి బట్టబయలు

### బీఆర్ఎస్ కార్యాలయాలపై దాడులు రేవంత్ పాలనలో పోలీసులు చేతగానితనానికి నిదర్శనం

గాంధీ భవన్ సంస్కృతి తో తెలంగాణలో అలజడి సృష్టిస్తున్న కాంగ్రెస్

జూబ్లీహిల్స్ నుంచి మణుగూరు వరకూ బీఆర్ఎస్ ఆఫీసులపై దాడులు

మీడియా సమావేశంలో ఎంపీ వద్దు రాజు, తాతా మధు మండిపాటు



**హైద్రాబాద్, మహా:** మణుగూరు ఘటన ద్వారా కాంగ్రెస్ పార్టీ మళ్లీ గుండా రాజకీయాలను ను గుర్తుచేసిందని, తెలంగాణ రాజకీయాలను ఇరవై ఏళ్ళు వెనక్కి నెట్టిందని బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు మండిపడ్డారు. మణుగూరు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడులు తీవ్ర రాజకీయ ఉద్రిక్తతకు దారి తీసాయి. ఈ ఘటనపై ఆదివారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మణుగూరు బీఆర్ఎస్ కార్యాలయం రేగా కాంతారావు స్వంత ప్రాపర్టీ. ఆయన సొంత డబ్బుతో నిర్మించుకున్న ఆ భవనాన్ని సగభాగం పార్టీ ఆఫీసుగా మార్చారు. అలాంటి వ్యక్తిగత ఆస్తిపై దాడి చేయడం కాంగ్రెస్ దుర్మార్గానికి నిదర్శనం, అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఫర్నీచర్ తగులబెట్టడం, కార్యకర్తలను విచక్షణారహితంగా కొట్టడం వంటి చర్యలు ప్రజాస్వామ్యానికి మచ్చ అని పేర్కొన్నారు. మణుగూరు పోలీసులు ఫర్నీచర్ కాలిపోతుంటే చూస్తూ వుండిపోయారు. పోలీసులు కాంగ్రెస్ పార్టీకి ఊడిగం చేస్తున్నారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో సిరిసిల్ల, సిద్ధిపేట, భువనగిరి ప్రాంతాల్లో కూడా బీఆర్ఎస్ కార్యాలయాలపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడులు జరిపారని, ఇది గాంధీ భవన్ సంస్కృతికి ప్రతీక అని ఎమ్మెల్సీ తాతా మధు విమర్శించారు. "రేగా కాంతారావు డీఎంఎఫ్‌టీ నిధుల దుర్వినియోగంపై ప్రశ్నించారని, అందుకే ఆయన ఆఫీసుపై దాడులు జరిగాయి. రాష్ట్రంలో పోలీసులు ఉన్నారా? లేక కాంగ్రెస్ గూండాలు మాత్రమే పాలన సాగిస్తున్నారా?" అని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నేతలు హింసను రాజకీయ ఆయుధంగా మార్చుకున్నారని, ప్రజాస్వామ్య పద్ధతులను తుంచిపారేస్తున్నారని నేతలు ఆరోపించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు కాంగ్రెస్ కార్యకర్తలకు నేర్పుతున్నది ఇదేనా? శాంతియుత ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ అలజడి సృష్టిస్తోంది అని వారు వ్యాఖ్యానించారు. తాతా మధు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ పార్టీ. ఎన్ని దాడులు చేసినా భయపడదు. అధికారంలోకి వచ్చాక ఈ దాడులకూ, నష్టాలకూ వడ్డీతో సహా ప్రతిఫలం ఇస్తాం అని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల నేపథ్యంలో కూడా సీపీఎం మద్దతు పునరాలోచన చేయాలని, ఎందుకంటే కాంగ్రెస్ నేతలే సామినేని రామారావు హత్యకు కారణమన్న వాదనలు బలపడుతున్నాయని వారు పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో అన్ని పార్టీలు ఏకమైనా కూడా బీఆర్ఎస్ భారీ మెజారిటీతో గెలుస్తుంది. ఆ విజయం కేసీఆర్ కి బహుమతి అని అన్నారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతలు దిండిగాల రాజేందర్, బెల్లం వేణు, ఎం.రాజాగౌడ్, మల్లెల రవిచంద్ర పాల్గొన్నారు.

## మళ్లీ సిర్పూర్ నుండే పోటీ చేస్తా..

### ఆర్ఎస్పీ సంచలన వ్యాఖ్యలు

### సిర్పూరు ప్రజలు నన్ను తమ ఎమ్మెల్యేగా చూడాలనుకుంటున్నారు




**హైదరాబాద్, మహా :** మళ్లీ సిర్పూర్ నుండే బరిలోకి దిగుతానని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బాంబు పేల్చారు. కోనేరు కోనప్ప పార్టీలోకి వస్తానంటే తాను వ్యతిరేకించలేదని అన్నారు. పార్టీలోకి చాలా మంది వస్తుంటారు.. పోతుంటారని పార్టీ అవసరాలను బట్టి అది జరుగుతుందన్నారు. పార్టీ ప్రయోజనాలే తనకు ముఖ్యం అని తెలిపారు. పార్టీ నిర్ణయాన్ని తాను వ్యతిరేకించలేదని స్పష్టం చేశారు. కానీ తనను సిర్పూర్ ప్రజలు తమ ఎమ్మెల్యేగా చూడాలని కోరుకుంటున్నారని ఆ విషయాన్ని పార్టీ దృష్టికి తీసుకువెళ్లానని తెలిపారు. కోనప్ప తన సీటును తీసుకోదని ఆయనకు అనుచరులు ఉంటే తనను 45వేల మంది అభిమానించారని చెప్పారు. సిర్పూర్ నుండి పోటీ చేయాలనే తన మనసు చెబుతోందని, సిర్పూర్ ప్రజలు కూడా అదే కోరుకుంటున్నారని అన్నారు. పార్టీని ఒప్పిస్తాననే నమ్మకం తనకు ఉందని స్పష్టం చేశారు. ఓ మీడియా ఛానల్ ఇంటర్వ్యూలో ఆర్ఎస్పీ సంచలన వ్యాఖ్యలు చేశారు. సిర్పూర్ పై తగ్గేదిలేదన్నారు.

## గ్రూప్ 1 విజేత సుగంధినిని సన్మానించిన ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్ నారా భువనేశ్వరి




**ఆలేరు, మహా:** ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్ 1 ఫలితాలలో విజయం సాధించిన యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గుండ్లగూడెం గ్రామానికి చెందిన ముస్త్యాల సుగంధిని అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ గా జనగాం జిల్లాలో నియమితులయ్యారు. అయితే తాను చదివిన ఎన్టీఆర్ ట్రస్ట్ డిగ్రీ మరియు ఐఏఎస్ స్టడీ సెంటర్ కళాశాల గండిపేట హైదరాబాద్ నందు ట్రస్ట్ చైర్మన్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సతీమణి శ్రీమతి నారా భువనేశ్వరి తమ కళాశాల విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచిన సందర్భంగా గ్రూప్ వన్ ఫలితాలలో అధికారిగా నియామకం కావడం తమ కళాశాలకు గర్వకారణమని ప్రశంసించారు . తమ కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కుమారి సుగంధినిని శాలువాతో మెమొంటోతో సన్మానించి ఆమె తల్లిదండ్రులు ముస్త్యాల రవికుమార్ నిర్మలను అభినందించారు.. తమ కళాశాల విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిన ఎన్టీఆర్ కళాశాల అకాడమిక్ డీన్ మరియు అధ్యాపక బృందాన్ని కూడ నారా భువనేశ్వరి అభినందించారు . సుగంధిని గ్రూప్ 4 జూనియర్ అసిస్టెంట్, జూనియర్ లెక్చరర్ వరుస విజయాలు సాధించారు. గ్రామీణ విద్యార్థులు సైతం పట్టుదలతో చదివితే ఉన్నత ఉద్యోగ అవకాశాలు సాధించవచ్చు అని తమ కళాశాలలో ఐఏఎస్,గ్రూప్ వన్ సాధన కోసం ప్రత్యేక శిక్షణ ఉంటుందని తెలిపారు

## గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత డయోగ్నస్టిక్ టెస్ట్‌లు

### పేదప్రజల ఆరోగ్యానికి సుంకిరెడ్డి భరోసా




**కల్వకుర్తి, మహా:** వినూత్న కార్యక్రమాలతో టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి దూసుకుపోతున్నారు. కల్వకుర్తి మండలం, ఎల్లికట్ట గ్రామంలో ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మొబైల్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఇందులో 300 మందికి పైగా క్యాంప్ కి హాజరవ్వగా.., 239 మందికి విజయవంతంగా రక్త పరీక్షలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య సేవలు అందుబాటులో లేక,ఆరోగ్యంపై తగిన అవగాహన లేక చిన్న సమస్యలు కూడా పెద్దలు సమస్యలుగా మరి ఇబ్బందిపడుతున్న నిరుపేదప్రజలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గ వ్యాప్తంగా"సుంకిరెడ్డి ఆరోగ్య భరోసా" కార్యక్రమంలో బాగంగా ఏర్పాటు చేస్తున్న"సుంకిరెడ్డి ఉచిత మొబైల్ హెల్త్ క్యాంప్" సేవలపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ.. ఐక్యత ఫౌండేషన్ ద్వారా సుంకిరెడ్డి ఆరోగ్య భరోసా అనే కార్యక్రమంతో..నియోజకవర్గం నిరుపేద కుటుంబాలకు అండగా ఉండేందుకు ఉచిత అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచామని, తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని పేద ప్రజల ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ చూపునందించే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నిరుపేద కుటుంబాలు ఆర్థిక భారంతో వైద్య పరీక్షలు నిర్లక్ష్యం చేస్తున్నారని, వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం,వారికి తగిన నివారణ చర్యలను సూచించడం,గ్రామ స్థాయిలో ప్రజలలో ఆరోగ్య అవగాహన కల్పించడం,కోసమే ఈ ఉచిత మొబైల్ హెల్త్ క్యాంప్ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు.ఈ కార్యక్రమంలో.. గ్రామస్తులు మాజీ సర్పంచ్ లింగమయ్య,గ్రామ సీనియర్ నాయకులు బంగారయ్య,మధు,కృష్ణయ్య శెట్టి, మల్లారెడ్డి,మధు సూదన్ రెడ్డి,కేశవులు,రవి,నంద్య నాయక్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### 18 మంది అక్కడికక్కడే దుర్మరణం.. మరికొందరికి తీవ్ర గాయాలు

### రోడ్డు పక్క ఆగి ఉన్న వాహనాన్ని ఓ కారు ఢీ కొట్టడంతో ప్రమాదం



**రాజస్థాన్, మహా:** రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ కారు రోడ్డు పక్క ఆగి ఉన్న వాహనాన్ని ఢీ కొట్టడంతో 18 మంది అక్కడికక్కడే చనిపోయారు. మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. జోద్‌పూర్, సుర్ సాగర్ ప్రాంతానికి చెందిన 22 మంది బికనేర్‌లోని కోలాయత్ గుడికి వెళ్లారు. దర్శనం చేసుకుని ఆదివారం టెంపో కారులో ఇంటికి తిరిగి వస్తూ ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఫలోడి జిల్లాలోని మటోడా ఏరియాలో ఊహించని దారుణం చోటుచేసుకుంది. టెంపో కారు రోడ్డు పక్క ఆగి ఉన్న ఓ వాహనాన్ని ఢీ కొట్టింది. ఢీకొట్టిన వేగానికి టెంపో నుజ్జునుజ్జయింది. టెంపోలో ప్రయాణిస్తున్న 18 మంది భక్తులు అక్కడికక్కడే చనిపోయారు. మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెను వెంటనే రంగంలోకి దిగారు. సహాయక చర్యలు మొదలు పెట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీశారు. గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించారు. ఇక, ఈ సంఘటనపై ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.

**IN THE COURT OF III ADDL. JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE, MEDHCAL MALKAJGIRI DISTRICT : AT KUSHAIGUDA**

O.S.No. 415 OF 2023

Between:

Penjarla Archana ...Plaintiff

And

M/s. Pargathi Academy of Competitive Exams (Coaching Centre),@ Pragathi Academy of Competitive Exams (Coaching Centre) Proprietor, Sri Gudipalli Laxminarayana, S/o Ramulu, aged 40 years, Occ: Business, R/o H.No.3-26, Kotha Kamalapuram, Singareni, Khammam - 507 122 ..First Defendant

**To**

M/s. Pargathi Academy of Competitive Exams (Coaching Centre),@ Pragathi Academy of Competitive Exams (Coaching Centre) Proprietor, Sri Gudipalli Laxminarayana, S/o Ramulu, aged 40 years, Occ: Business, R/o H.No.3-26, Kotha Kamalapuram, Singareni, Khammam - 507 122

The Plaintiff filed suit O.S.No. 415/2023 against Defendents 1 and 2 for Eviction and other relieves. The case is posted on 24-11-2025 at 10.30 A.M before the above mentioned Court. If you fail to appear thorugh Advocate or yourself on said date the case will be dealt in accordance with law by court.

**K. Balakrishna**
**K. Prashobh Kumar**
**K. Kavitha latha**
**D. Rishitha**
**Advocates,**
**H.No. 1-1-336/10,**
**Chikkadpally, Hyderabad,**
**Mobile No. 9246157123**
**Email id: kommaraju2007@gmail.com**
**"By Order of the Court"**

మహా పత్రిక
ANN తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 03-11-2025



## ఖమ్మం ఈస్తటిక్స్ 2025 సాహితీ అవార్డుల ఫలితాలు

ఖమ్మం ఈస్తటిక్స్ సాహిత్య పోటీకి కథలను, కవిత్వ సంపుటాలను ఆహ్వానించగానే స్పందించిన తెలుగు కవులకు, కథకులకు కృతజ్ఞతలు. 90 కి పైగా కవితా సంపుటులు, 140 కి పైగా కథలు వచ్చాయి. కమిటీ అభ్యర్థన మేరకు కవిత్వానికి ముగ్గురు, కథలకు ముగ్గురు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కవిత్వం విభాగంలో పలమనేరు బాలాజీ కవితా సంపుటి 'లోపలేదో కదులుతున్నట్టు' 40వేల రూపాయల బహుమతిని గెలుచుకుంది. మరో ఇద్దరికి ప్రత్యేక ప్రశంసగా ప్రోత్సాహక అవార్డులు ఇవ్వాలని న్యాయ నిర్ణేతల సూచన మేరకు కమిటీ నిర్ణయించింది. రేణుక అయోల కవితా సంపుటి 'రవిక', పాయల మురళీకృష్ణ 'గచ్చం చెట్టుకు అటూ ఇటూ' ప్రత్యేక ప్రశంసకు అర్హంగా ఎంపికయాయి.

కథల విభాగం లో ఉత్తమ కథగా వి. ఆర్ రాసాని 'తేనెకల్లు' 25 వేల రూపాయల బహుమతిని గెలుచుకుంది. ద్వితీయ ఉత్తమ కథగా ఆలూరి అరుణ్ కుమార్ 'అంజమ్మ' 15 వేల రూపాయల బహుమతిని, తృతీయ ఉత్తమ కథగా యాములపల్లి నర్సిరెడ్డి 'కావలి' పదివేల రూపాయల బహుమతిని గెలుచుకున్నాయి. ప్రతి సంవత్సరంలాగానే బహుమతులు గెలుచుకున్న కథలతో సహా పోటీకి వచ్చిన కథలలో పన్నెండు కథలను ఒక సంపుటిగా ప్రచురించాలని ఖమ్మం ఈస్తటిక్స్ కమిటీ నిర్ణయించింది.

ఎం. సుగుణాకర రావు 'అప్పో దీపోభవ,' సుంకోజు దేవేంద్రాచారి 'శివుడాజ్ఞ, 'ఎం. ప్రగతి 'ఉంకువ, 'సంజయ్ ఖాన్ 'మూడో కన్ను, 'గౌతమ్ లింగా 'నల్లమల్లె చెట్టు', జీ.వి.శ్రీనివాస్ 'నేలరాలిన పువ్వు', బి. కళా గోపాల్ 'ఇష అసంతం', గుమ్మడి రవీంద్రనాథ్ 'అనగనగా ఒక హంస', ఆర్వీ. రమణ శాస్త్రి 'అసూయ' కథలు సాధారణ ప్రచురణకు ఎంపికయాయి. న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన ఆరుగురికి ఈస్తటిక్స్ కమిటీ సభ్యులు రవిమారుత్, ప్రసేన్, సీతారాం, వంశీ కృష్ణ, మువ్వా శ్రీనివాసరావ్, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, ఫణిమాధవి కన్నోజు, గౌరవాధ్యక్షులు ఓల్గా, Lsr ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

**నవంబర్ 9న ఖమ్మంలో జరిగే అవార్డుల ప్రదాన కార్యక్రమంలో విజేతలకు నగదు బహుమతి తో పాటు షీల్డ్ అందించనున్నట్టు కమిటీ ప్రకటించింది. విజేతలకు అభినందనలు.**

- రవి మారుత్, ఖమ్మం ఈస్తటిక్స్


## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034.


## సమకాలీన సాహిత్యానికి నిలువెత్తు ప్రతీక
# ఆచార్య గంగిశెట్టి

ఆయన మరణించారు? కానీ, నాతో నిత్యం మాట్లాడుతున్నట్లే ఉంది. తన గురించి గుండెగొంతుకలో కొట్లాడుతున్న నాలుగు మాటల్ని బయటపెట్టలేకపోతున్నావేమని ప్రశ్నిస్తున్నట్లుంది. ఆయన పేరు ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణగారు. సుమారు ఆయన భౌతికంగా 78 ఏళ్ళపాటు జీవించారు. 1 ఆగస్టు 2025 వ తేదీన అమెరికాలో, తన కుమారుడి ఇంటి దగ్గర మరణించారు. ఆయన 2005 ఆగస్టునుండి 2008 ఆగస్టువరకు కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయానికి వైస్-ఛాన్సలర్ గా పనిచేశారు. అంతకు ముందు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదులో లెక్చరర్ నుండి ప్రొఫెసర్ వరకు పనిచేశారు. అక్కడే డైరెక్టర్ గా, డీన్ గా వివిధ హోదాల్లో పనిచేశారు. తన జీవిత చరమాంకంలో 'సిరికోన వాక్స్థలి సాహితీ అకాడమీ' అనే వాట్సాప్ గ్రూప్ ద్వారా సాహితీచర్చలు చేస్తూ గడిపారు. దాని కేంద్రంగానే అనేకమంది యువకుల నుండి వృద్ధసాహితీవేత్తల వరకు ఆయన సాహితీ చర్చోప చర్చలు చేసేవారు. అంతకు ముందు ఎంతోమందితో ఆయనకు గురుశిష్య సంబంధాలున్నాయి. కానీ, ఈ గ్రూపు ద్వారా ఆయనతో అత్యంత అనుబంధాన్ని పెంచుకున్నవాళ్ళున్నారు. రసభరితమైన ఒక వాక్యం రాసినా, అటువంటి వాళ్ళను ఆయన ఎంతగానో ప్రోత్సహించేవారు. అదే ఆయన్ని ఎంతోమంది గుర్తుపెట్టుకొనేలా చేసింది. అదే ఆయన మరణాన్ని జీర్ణించుకోలేకుండా చేస్తుంది. నేటికీ ఆ గ్రూపులో వాళ్ళ ఆవేదనలు కొనసాగేలా చేస్తుంది.



ఆయనతో మాట్లాడుతున్నంతసేపూ ఆ కళ్ళల్లో ఒక వాత్సల్యమేదో కురుస్తున్నట్లుండేది. పిల్లలు మాట్లాడుతుంటే తండ్రి తన్మయంతో వింటున్నదృశ్యమే కనిపించేది. తనకే తెలుసునన్నట్లు మనమేదో మాట్లాడుతుంటే చిరునవ్వేదో ఆయన ముఖంపైనుండి మన హృదయంపై ఒక సంతకమేదో చేసినట్లుండేది. ఇంటికి పిలవడం, తన హోదాను కూడా మరిచిపోయి కుటుంబసభ్యుడిలా ఆదరిస్తూ ఏదొకటి తినిపిస్తూ తదేకంగా చూడ్డం వంటి ఆయన అనురాగతన్మయత్వాన్ని అనుభవించినవాళ్ళకే తెలుస్తుంది. మరలా ఆయన మాట్లాడ్డం మొదలు పెడితే, ఈయనతోనేనే మనం ఇంతసేపూ మాట్లాడిందనిపిస్తుంది. ఆయనొక విజ్ఞాన సర్వస్వంలా, మహోన్నత జ్ఞాన పర్వతంలా కనిపిస్తారు. మనం మాట్లాడిందేదో ఆయన కూడా అంగీకరించేసినట్లో, అంగీకరించలేనట్లో వాదనలు పెట్టుకుంటారు. చిన్నపిల్లాడిలా చిన్నబుచ్చుకుంటారు. అంతలోనే అన్నీ మరిచిపోయి హృదయానికి హత్తుకుంటారు. పిల్లాడిని ఒడిలో పెట్టుకొని లాలిస్తారు. అలాంటి సంఘటనలన్నీ గుర్తొస్తుంటే ఆయనలో దైవత్వం ఉందేమోననిపిస్తుంది. మనమేమి చేయాలో ఆ సృష్టికర్తకు తెలిసినా, అన్నీ తానిచ్చి కూడా మనల్ని పరీక్షించే దైవత్వపు దోబూచులాటేదో ఆడేవారేమోననిపిస్తుంది.

ఆయన పాశ్చాత్య సాహిత్యం గురించి చెప్పినా, తెలుగు సాహిత్యం గురించి మాట్లాడినా, సంప్రదాయమైనా, ఆధునికమైనా ఆయన మాట్లాడుతున్నంత సేపు మనం మౌనంగా మారిపోవాల్సిందే. ఆ మాటల్లో ఒక జ్ఞానప్రవాహం. దానిలో మనం కొట్టుకుపోవాల్సిందే. ఒక ఆత్మీయానురాగబంధం కట్టిపడేసేది. దానితో ముడిపడాల్సిందే. ఆయనను నేను మొదటిసారిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కలిసాను. ఒక ప్రత్యేకమైన ప్రసంగాన్ని ఏర్పాటు చేసి ఆయనను మా తెలుగు శాఖకు ఆహ్వానించినప్పుడు కలిశాను. అప్పుడు, ఆచార్య తుమ్మల రామకృష్ణగారు తెలుగు శాఖకు అధ్యక్షులుగా ఉండేవారు. అప్పటికే ఆచార్య పిల్లలమర్రి రాములుగారికి కూడా ఆయన బాగా పరిచయమని తెలిసింది. నన్ను, రామకృష్ణగారిని ఒకసారి ఆచార్య గంగిశెట్టిగారి ఇంటికి తీసుకెళ్ళారు. ఆరోజు రాములుగారితో ఆయనకు చిరకాలంగా పరిచయం ఉందని తెలిసింది.

ఆచార్య గంగిశెట్టిగారు నాకు అంతకుముందు వ్యక్తిగతంగా తెలియకపోయినా ఆయన రచనలు నాకు తెలుసు. ఆచార్య కొలకలూరి ఇనాక్ గారిపై ఒక వ్యాసం రాస్తూ రిఫరెన్స్ రచనలను ఉటంకిచేటప్పుడు, ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణగారు వ్యాసాన్ని కూడా ప్రస్తావించాను. ఆయన మా డిపార్ట్మెంట్ కి వచ్చినప్పుడు ఆ వ్యాసంలో నేను ఎప్పుడో చదివిన విషయాలు చెబుతూ ఉంటే నన్ను ప్రత్యేకంగా గుర్తుపెట్టుకున్నారు. ఆ తర్వాత వారికి నా 'వీచిక', 'బహుజన సాహిత్యదృక్పథం', 'సాహితీ మూర్తులు-స్ఫూర్తులు' పుస్తకాలతో పాటు నా 'నెమలికన్నులు' కవిత్వాన్ని పోస్ట్ ద్వారా ఆయనకు పంపించాను. కొన్నాళ్ళకు ఆయన నాకు ఒక లేఖ రాశారు. ఈస్తటిక్స్ పై నేను రాసిన వ్యాసాలు ఆయనకు బాగా నచ్చాయి. ఎంతో సంతోషించారు. అవి చదివిన తర్వాత ఆయనే ఫోన్ చేస్తుండేవారు. నన్నెంతగానో ప్రోత్సహించేవారు. ఆయన రాసిన కవితలను పంపిస్తుండేవారు. నాగరాజు రామస్వామి కవిత్వాన్ని బాగా ఇష్టపడేవారు. ఆయన మొదట కవిత్వం రాశానని చెప్పారు. తర్వాతనే వ్యాసాలు రాసాననీ, అనువాదం చేశానని చెప్పారు. ఆ పుస్తకాన్ని కూడా నాకిచ్చారు. ఆయన కన్నడం నుండి అనువాదం చేసిన డా.ఎస్.ఎల్. బైరప్పగారి "పర్వ" నవల ప్రస్తావన వస్తే, మహాభారతాన్ని, దానిలోని ప్రతీకాత్మక, మానవీయ సంబంధాలను ఎంతో చక్కగా వివరిస్తుండేవారు.

ఆయన నాకు ఇచ్చిన పుస్తకాలు చదివి, వాటిలో పరిశోధక విద్యార్థులకు ఉపయోగపడే అంశాల గురించి మాట్లాడేవాణ్ణి. ఆ సంభాషణల ఫలితంగా పరిశోధక విద్యార్థులకు ఉపయోగపడే విధంగా 'సాహిత్యపరిశోధనా కళ: విధానం' అనే పుస్తకం రాశారు. దానికి నన్ను ఎడిటర్ గా ఉండమన్నారు. ఆశ్చర్యపోయాను. ఆ పుస్తకానికి నన్ను ఎడిటర్ గా ఉండమనడమే కాదు, దానిలోని అంశాలు రాసి పంపిస్తూ, విద్యార్థులకు ఉపయోగపడే అంశాలను తరచి తరచి అడిగి తెలుసుకొని ఆ పుస్తకాన్ని పూర్తి చేశారు. ఆ పుస్తకానికి ఒక విలువైన సంపాదకీయాన్ని రాయించారు. ఆ పుస్తకాన్ని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటిలో ఆవిష్కరించి, తన కుమారుడు కీ.శే.చెన్నసాయికిశోర్ స్మృత్యర్థం సభలో పాల్గొన్న పరిశోధక విద్యార్థులతో పాటు, ఎం.ఏ. విద్యార్థులకు కూడా ఉచితంగా ఆ పుస్తకాన్ని బహూకరించారు. ఆయన అప్పుడప్పుడు రాసిన కవితలను "మండువాలోగిలి" పేరుతో ప్రచురించారు. దాని ఆవిష్కరణ సభలో ఆ పుస్తకాన్ని నన్నే పరిచయం చేయమన్నారు. ఆ సభకు శ్రీమతి నందమూరి పార్వతి గారు అధ్యక్షత వహించారు. ఆమె ఆచార్య గంగిశెట్టిగారి శిష్యురాలు. మంచి సాహితీవేత్త.

సాహిత్యంలో ఆధునికత, సమకాలీనత అనేవి ఒకటి కాదు. సమకాలీనతలో ఆధునికత ఉంటుంది. ఆధునికత కాలాన్ని, భావజాలాన్ని, నవ్యత్వాన్ని ఆధారంగా చేసుకొంటుంది. పాత పద్ధతులకు బదులుగా హేతువాదం, శాస్త్రీయ ఆలోచనలు, వ్యక్తివాదం, పారిశ్రామికీకరణ, నూతన ఆవిష్కరణలను స్వీకరించడం వంటివి ఆధునికతలో ఉంటాయి. అంతేకాదు, సాంప్రదాయిక విశ్వాసాలు, మూఢవిశ్వాసాలకు బదులుగా శాస్త్రం, హేతువు ఆధారంగా విషయాలను విశ్లేషిస్తుంది. సమకాలీనతలో సంప్రదాయం, ఆధునికతలు రెండూ మిళితమై ఉంటాయి. సాధారణంగా ఆధునికత మానవుని కేంద్రంగా ఉంటే, సమకాలీనత మానవుడు, మానవేతరశక్తుల కేంద్రంగా ఉంటుంది. వీటితో పాటు ఉత్తరాధునికత (పోస్ట్ మోదర్నిజం), ద్రవాధునికత (లిక్విడ్ మోదర్నిటి) అనేవి కూడా భారతదేశంలో, అదీ తెలుగు వాడుకలో ఉన్న ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ఉత్పత్తి అవుతున్న సాహిత్యంలోను కనిపిస్తుందని కొంతమంది సాహితీవేత్తలు సూత్రీకరిస్తున్నారు. ఏకైక సత్యం అనేది ఉండదని, జ్ఞానం, సత్యం అనేది వ్యక్తిగత అనుభవాలు, దృక్పథాలు, మ సామాజిక నిర్మితిపై ఆధారపడి ఉంటుందని పోస్ట్ మోదర్నిజం వాదిస్తుంది. లిక్విడ్ మోదర్నిటీ అనేది ఆధునిక సమాజం యొక్క అస్థిరమైన, మార్పు చెందుతున్న స్వభావాన్ని వివరిస్తుంది. ఈ సమాజంలో ఏదీ శాశ్వతం కాదు. సామాజిక నిర్మాణాలు, సంబంధాలు ద్రవంలా నిరంతరం మారుతూ ఉంటాయి. ప్రజలకు ఎక్కువ స్వేచ్ఛ లభిస్తుంది, కానీ దానితోపాటు అభద్రత, ఆందోళన కూడా పెరుగుతాయి. వీటిని మన తెలుగు సాహిత్యంతో సమన్వయిస్తున్నవాళ్ళున్నారు. సృజనసాహిత్యం సృష్టించేవాళ్ళకు ఈ భావనలు, సిద్ధాంతాలు తెలియవచ్చు, తెలియకపోవచ్చు. కానీ, విమర్శకులు, పరిశోధకులు మాత్రం వీటిని తెలుసుకోవాలి. ఇవన్నీ ఆయన పుస్తకాల్లో ఎంతో వివరణాత్మకంగా రాశారు. అంత మేధావి అయినా, మనం ఏదైనా మాట్లాడితే ఎంతో గొప్పమాట చెప్పినట్లు ప్రోత్సహించేవారు. మనలో కొద్దిపాటి ప్రతిభను గమనించినా కొండంత ఆనందంతో సంతోషించే వ్యక్తి ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ గారు.

ఆయనతో ఉన్న అనుబంధంలోని కొన్ని విషయాలనైనా రాయకపోతే ఆయన ఆత్మనన్ను నిత్యం ప్రశ్నిస్తున్నట్లనిపిస్తుంది. అందుకే ఆయన గురించి నాలుగు మాటలిలా మీతో పంచుకుంటున్నాను.



-ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు
99896 28049

# బతకనియ్యని గాయం... ఇంకా సలుపుతూనే వుంది

ఈ గాయం ఈ నాటిది కాదు. అందమైన కనుబొమ్మల్ని భయంకరంగా కత్తరించుకున్న మానవత్వం, క్రమంగా దానవత్వపు గడపల్లో బ్రతకటం నేర్చుకున్న రోజునుంచి ఒక మనిషి మరో మనిషి జీవితం మీద కర్కషంగా చేసిన గాయమిది. ఆ గాయం నుంచి కారిన రుధిరం, విసిరి వేయబడ్డ ఒక చరిత్ర పేజీలనిండా సిరాచుక్కలై ఇప్పటికీ పలకరిస్తూనే వుంది. మనిషికే కాదు, గాయాలకు గుండె వుంటుంది. గాయాలు సలుపుతున్నాసరే ఎప్పుడో నలిపేసిన గొంతునుంచి ఒక సన్నటి మూలుగు మనకు వినిపిస్తుంది. ఆ శబ్దాన్ని అర్థం చేసుకునే భాష మనసుకు వుంటే, ఆ మూలుగే పదాలుగా మారుతుంది, వాక్యాలై పలకరిస్తుంది. కవితలై ఎగిరి మనముందు వాలుతుంది. అలా గాయాలతో వాలిన పావురాన్ని చేతుల్లోకి తీసుకొని రెక్కల్ని నిమురుతూ పేరడిగితే, కాలిన ప్రేగులనుంచి సగంకాలిన తన గుండె ద్వారాలను తెరుచుకొంటూ, మెల్లగా గొంతువిప్పి కేశవ కుమార్ తనకు పెట్టిన పేరు 'ఎగిరే పళ్లెం, నడిచే మంచం, ఓ కూనిరాగం...' అంటూ చెవిలో గుస, గుసలాడింది. అలా ఆ తెల్లపావురాన్ని చేతపట్టి ఒక్కొక్క రెక్కనే విప్పుతూ, ఆ రెక్కల ఈకలు మోస్తున్న రాతల్ని తనివితీరా చదవటం మొదలు పెట్టాక, బతకనియ్యని ఓ గాయం... ఒక జాతిని ఇంకా ఎంత భయంకరంగా సలుపుతుందో, ఆ బాధను ప్రేమగా ఆలింగనం చేసుకుని ముద్దాడుతున్నప్పుడు నా వెనక నా నీడలో ఒక మనిషి కదులుతున్న దృశ్యం చాలా స్పష్టంగా కనపడుతోంది.


'అంబేద్కర్ నా కవిత్వ చిరునామా...' అంటూ సగర్వంగా ప్రకటించుకున్న ఈ కవి కాలం జారుబండ మీద తాపీగా తిరుగుదామనకున్నాడు కానీ, మనుషులంటే తెలియకుండనే బతికే కోణాల్లోకి విసిరివేయబడ్డాడు. కష్టాల కడలి అలల్ని ఈదుకుంటూ, తీరం అంచును పట్టుకుని నిటారుగా నిలబడి ఓ కాలజ్ఞానిలా ఈ ప్రపంచాన్ని ముద్దాడినప్పుడు, అప్పటి పాకలో చూరుపట్టుకుని కారిన వర్షపు చుక్క గట్టిగా చప్పట్లు కొడుతోంది. అదే రాజకీయం, అదే కల్లోల ప్రజాజీవితం, అదే నిరంకుశ పాలన, అవే మత హూంకరింపులు... ఏమాత్రం మార్పులు లేవు. అభద్రత భవిష్యత్తులో ఊపిరాడని జనం ముందు, తనకు తెలిసిన భాషతో కేకలేస్తూ ఈ కవి ఒక నిరసన పత్రాన్ని లిఖిస్తున్నాడు. మృత ప్రవాహానికి అడ్డంగా ఈదే అడ్డగోలు మనిషిగా మారాలనుకుంటున్నాడు. కదలని కాలానికి సవాలిగా నిలిచి, ఇన్నాళ్లు సాగిలపడి, నేలనుండి కొలిస్తే అంగుళం కూడా జీవితంలో ఎదగని జనసమూహానికి కొత్త చరిత్ర అందించేందుకు తన ధైర్యాన్ని పాళీగా మార్చుకొని ఒక సైనిక కవాతుకు సిద్ధమవుతున్నాడు.

ఒంటినిండా ధర్మం బొట్లు పెట్టుకుని, పూలదండలతో ఊరేగిన వేటకొడవళ్లు తలలు నరికి ప్రాణాలు తీసినప్పుడు... 'ఇదేమి న్యాయమని అక్షరం ముందుకెళ్లని / రాజ్యాంగం పుస్తకంవంక ఆశగా చూస్తావ్...' అంటూ కాలం కొన్ని సంఘటనలను గుర్తుచేస్తోంది. ఓట్లలెక్కల్లో తీసివేసిన ప్రాణాలు, పుట్టుకతోనే తమ ముఖాలమీద అంటించిన 'అపౌరులనే' స్టిక్కర్లను పీకలేక, పీకితే చర్మాలు వూడిపోతున్నాయి. ఈ దేశం పేగు తెంచుకుని పుట్టినందుకు, హక్కుల జాబితానుండి రాలిపాయి, నడిచే పాదాలకింద మట్టికణాలతో స్నేహం చేసినప్పటి గాయాలను 'మందులేని దేశీయ సాంస్కృతిక పచ్చిగాయాలు'గా ముద్రిస్తూ వచ్చిన మూకజాతి రాజకీయాల తీర్మానాలు, శవాలుగా ఇప్పటికీ కాలం తీగలకు వ్రేలాడుతూనే వున్నాయి.

ఈ కవి దృష్టిలో తాను నడిసొచ్చిన దారంతా చీకటే. సూర్యుడు, చంద్రుడులేని దారుల్లో అతడు నడుస్తున్నాడు. .ఇతడు ఊహల్లో ఊగిపోతూ కవిత్వం రాయలేదు. గతచరిత్ర కార్చిన కన్నీరంతా గుర్తుకొచ్చి సెలయేర్లనిండా సముద్రాలను మించిన ఉప్పు అతడ్ని పలకరిస్తోంది. అడవి గర్భాన్ని కూల్చిన ప్రోక్లేన్ గాట్లులా అతని వొళ్లంతా ఇంకా సలపరిస్తున్న జ్ఞాపకాలే. ఈ కారణాల చేతనే ఎవరి రాతల్లో ఇంకని బ్రతుకు ప్రయాణాన్ని తన జాబితాలో రాసుకొన్నాడు. ఒకచోట ఈ కవి ఇలా అంటున్నాడు... 'అక్షరాలకు ఆవతల ఇంకా మిగిలిపోయిన వేదన నాది / నేను నిత్యం కాలుతున్న కడుపుమంటని / చేతనయితే అక్షరాల్లేని భాషలో నన్ను హత్తుకో / నేను మలాన్ని చేత్తో ఎత్తేసినట్లు...' అంటూ తాకిన ఈ మాటలు మనసున్న ఏ మనిషినైనా కదిలించి, కరిగించి, ద్రవింపజేస్తాయి. 'ఇప్పుడు యంత్ర నగరాన్ని నిద్రపుచ్చే మంత్రం కావాలి / మంత్ర నగరితో / మాట్లాడే ధైర్యం కావాలి / కొత్త వాక్యాన్ని తోడు తీసికెళ్లాలి / మనమున్న అగాధ లోయల్లోకి / మాయలేని మంత్ర నగరంలోకి...' అంటూ ఎండిన డొక్కలు, వంగిన వెన్నుపూసలు, నడవలేని కళేబరాళ్లు, ఎటుచూసినా విరగబడి పండిన కన్నీళ్లు... వీటి మధ్య నిలబడి వూరిమీద ఉరిమిచూస్తున్న అంబేద్కర్ బొమ్మ ఆత్మగౌరవానికి తలవంచి నమస్కరిస్తున్నాడు ఈ కవి.

తర, తరాలుగా కారిన కన్నీటి చారల తడిని ఇంకా తడిమి చూసుకుంటూ... 'మెరుపులా / ఒక పిడుగొచ్చి / గత శబ్దాలన్నిటినీ / చెరిపేస్తే బాగుణ్ణు / వచ్చే వానజల్లుకి / వరదలా కర్మఫలాలన్నీ / కొట్టుకెళ్తే బాగుణ్ణు...' అంటూ వ్యక్తపరిచిన ఈ మాటల పొరల్లోకి ఒక్కసారి తొంగిచూస్తే, కాలం క్యాలెండర్ మీద పేరుకుపోయిన బురదరంగు ఎంత అసహ్యంగా వుందో తెలుస్తోంది. పగిలిన అద్దంలో కవి తన ముఖాన్ని చూసుకుంటున్నాడు. ఆటల్లో అవహేళనని, వినోదాల్లో వెటకారాన్ని తనమీద నిప్పుల్లా కురిపించిన వాళ్లు తినే ప్రతి ముద్ద మీద తన చెమటముద్రలే కనిపిస్తున్నాయి. అవతలి వాళ్లు ఒక వికారమైన నాగరికతకు హక్కుదారులైతే, తానుమాత్రం నేలతల్లి ఆలింగాలనాలతో నాగలికి మరోరూపంగా మారిపోతున్నాడు. పగిలిన అద్దంలో అతని ముఖం వెయ్యిముక్కల్లా కనిపించడంలేదు. మరచిన చరిత్రలో అతని చిరునవ్వు, విప్పిన జ్ఞాపకాల పొట్లంగా కనపడుతోంది. కాలానికి ఎదురుగా నిలబడ్డ ఈ కవి, తనకుతానే కొత్త భాషగా ఆవిష్కరించుకుంటూ... 'నేనిప్పుడు చరిత్రను కాదు సజీవ సత్యాన్ని / నేను నిత్య గాయాల ప్రతిబింబాన్ని...' అంటూ చుక్కల చీరలో చిరిగిన పాటని చుట్టుకుని చీకట్లో నడుచుకుంటూ వెళ్తున్నాడు.

ఇంటిలోపల బంధీ అయిన తాను, నేరం తేలకుండనే జైల్లో శిక్ష అనుభవిస్తూ, నిశ్శబ్దాన్ని నములుకుంటూ చీకటిగదిలో గోడలకు మాత్రమే తెలిసేలా తనలో తాను మాట్లాడుకుంటున్న మిత్రుడు గుర్తుకొచ్చిన సందర్భమిది. ఊరుల్లోంచి, వేదనల్లోంచి, అవమానాల్లోంచి, అణిచివేతల్లోంచి, తానూ తన మిత్రుడు యూనివర్సిటీలోకొచ్చి, ఆత్మగౌరవ పాఠాల్ని పరిచయం చేద్దామనుకున్న సంగతులన్నీ గడియారంలోని మళ్ల మీద నిలబడి కరచాలనం చేస్తున్నాయి. 'ఈ గాంధీ జయంతినాడు / ఎక్కడా మాంసం కూడా దొరకదు / మనుషుల వేటమాత్రం సాగుతూనే వుంది! / మేమేమో / నిత్యం నిఘూ జైలులోనే!...' అంటూ తెలియకుండనే కవి కనురెప్పల మధ్య ఊరుతున్న తడి మనల్ని తట్టి మరీ మాట్లాడుతోంది. 'ఇప్పుడు నేను మనిషిని కాదు / జ్ఞానాన్ని, చరిత్ర చోదకుడ్ని కాదు / కోపాన్ని, కసిని అంతకన్నా కాదు / నేను పన్నెండంకెల సంఖ్యని మాత్రమే / సంఖ్యలో ఇంకిపోయిన నేను / నన్ను నేను మరిచి పోయి / కాగితం ముక్కమీద నెంబర్...' అంటూ ఈ కవి తన అస్తిత్వాన్ని వెతుక్కుంటూ సాగిపోతున్నాడు.




కవికున్న అద్భుతమైన ఊహాశక్తి పదే, పదే చాలా కవితల్లో తొంగిచూస్తూ మన ఆశ్చర్యానికి తెరలు తీస్తోంది. ఆకాశంలో మేఘాలు మాయమయ్యాయి. చూస్తే వాటిని రైతు కోసుకెళ్లి నెర్రులిచ్చిన పొలంలో చల్లుతున్నాడు. మారం చేస్తున్న పిల్లాడికి ఓ అమ్మ చందమామను కిందికి దింపి గోరుముద్దలు చేసి తినిపిస్తోంది. చీకటి పడకముందే నక్షత్రాలన్నిటిని నోటికి కరచుకొని పిట్టలు ఎగిరిపోతున్నాయి. మార్కెట్ లో తప్పిపోయిన భూమిని గురించి, ప్రపంచాన్ని వదిలి పారిపోయిన సూర్యుడి గురించి వెతుకుతున్న నేపథ్యంలో నీలి ఆకాశం వెలుగు చుక్కల మధ్య, చల్లని చందమామ బొమ్మ, ఆదివాసుడి అందమైన కవిత్వం, దొరికిన అజ్ఞాత సూర్యుడి ఆచూకీ!... ఇవన్నీ కవితా శిల్పానికి కవి అద్దిన సొగసులుగా సంతకాలు చేస్తున్నాయి.

**పుస్తక సమీక్ష**

మాట్లాడటం మానేసిన మనుషుల మధ్య మాటల్ని నేర్పే వ్యాకరణంలా సాగిపోతున్న ఈ కవి, కాలాన్ని తన అక్షరాలతో కదిలించడం మొదలుపెట్టాడు. బానిసత్వాన్ని భరిస్తున్న బాధితుడి ఓర్పులా తన సహనానికి పదును పెట్టుకుంటూ... కులం, మతం, మార్కెట్, టెక్నాలజీ...ఇలా అనేక రూపాలలో కనిపించే దోపిడీ కులాల ఆధిపత్యాన్ని ప్రశ్నించే సామాజిక వర్గాలను అణిచివేస్తున్న దుర్మార్గాలపట్ల కవి తాను సాగిస్తున్న పోరాటంలో అంబేద్కర్ తాత్విక స్ఫూర్తి, అంతర్లీనంగా ఒక మహాశక్తిలా సహకరిస్తోంది. తన జనానికి దుఃఖమే లేని సుఖం కావాలని, నష్టాల్లేని లాభాలు రావాలని, వృద్ధాప్యమే రాని యవ్వనం ఉండాలని, మరణమే మాయమయ్యే సమయాలు వరించాలని కవి కేవలం కలలు కనడంలేదు. ఇవి అసాధ్యమని తీర్మానించిన వాళ్ల నోర్లు మూతపడేలా రేపటి భవిష్యత్తు ద్వారాలకు తానే గుమ్మాలుగా మారిపోతున్నాడు. నిద్రలేక ఊపిరాడని ఊహల్ని నిజం చేసేందుకు తాను నమ్ముకున్న అక్షరాలకు నిత్యం తలస్నానాలు చేయిస్తున్నాడు. తానిప్పుడు చదివి పారేసే పుస్తకంలా మిగిలిపోవాలనుకోవడం లేదు. రోజూ ఉదయించే సూర్యుడిలా తన విన్యాసాలను కొనసాగించాలనుకుంటున్నాడు.

నమ్మకానికి, అపనమ్మకానికి మధ్య వ్రేలాడుతున్న అత్యాధునిక అజ్ఞానిని జనం మధ్యకు ఈడ్చుకొచ్చి, అమానవీయ విలువలపై, అన్యాయపు అధికారంపై, నీతిమాలిన చదువులపై, ఒక ప్రశ్నగా, బానిస బ్రతుకుల గొడ్డలిగా మారుతూ తిరుగుబాటుకు కదంత్రొక్కుతున్న జనావళి సమూహాన్ని చూస్తూ...'గబ్బిలంలా తలకిందుల ఆసనమేసి /గుడ్లగూబలా రాత్రంతా పెద్ద కళ్లేసుకొని / అరాచకంగా అరుస్తున్న / వీడొక భవిష్యత్ దిష్టిబొమ్మ / ఊరి పొలిమేరల్లోకి విసిరేయండి / జన సమూహాల్లో కలవనీయకుండా...' అంటూ ఒక ప్రణాళికను అందిస్తున్నాడు ఈ కవి. దానితో ఆగకుండా 'చరిత్రంటే చేతులు కట్టుకొని కూర్చోటం కాదు కదా! / గతం మీద భవిష్యత్తు చేసిన పోరాటం...' అంటూ జాతి విముక్తికి తప్పని చర్య పోరాటమేనని మరోసారి గుర్తు చేస్తున్నాడు. తన ముందు నిలబడ్డ జనాన్ని చూస్తూ... ముఖంలేని మనుషుల్ని మనం చూసి వుండొచ్చు. గుండెలేని మనిషినెప్పుడైనా చూశారా? అంటూ కవి సంధించిన ప్రశ్నతో అక్కడి జనమంతా ఒక్కసారి తమ వొంటిని తడుముకున్నారు. ఒంట్లో ఎక్కడా ఏ శబ్దమూ లేదు. గాబరాపడిపోయి వణికిపోయారు. భయపడవద్దని కవి అందర్ని ఒక్కసారి ఆలింగనం చేసుకున్నాడు. అంతే అందరి గుండెలనిండా డప్పులు మ్రోగిన శబ్దం. ఒంటినిండా ఆకాశాన్ని తాకే తరంగాలు పోరాటాల జెండాలుగా అజెండాలు రాస్తున్న దృశ్యం. ఆకాశమిప్పుడు నీలంగా కాదు. అందరికీ ఎర్రగా కనపడుతోంది.

విక్టోరియా కిరీటంలో తళ్కుమన్న భారతదేశ బానిసత్వాన్ని గురించి ప్రస్తావించిన సమయంలో, పత్తిని పండించే రైతన్నల తలపాగాలలోని కష్టాలను రాసులుగా పోస్తూ... రైతుల రక్తపు మరకలు / మాంచెస్టర్ మిల్లు గుడ్డలై /తిరుగులేని తెల్లమార్కెట్టుగా / రొమ్మిరిచిన సామ్రాజ్యం / రాబందు రెక్కల్ని చాపుకుంటూ...' అంటూ దోపిడి చేసే మహాకిరాతకుల అంతర్జాతీయ కుట్రలను బహిర్గతం చేస్తున్నారు. నైలూనది నాగరికత సాక్షిగా సొమాలియా డొక్కలు ఆకలితో మాడిపోతూ తెల్లోడి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆ దుఃఖపు మైదానాల మీద పాఠకుల్ని చేయిపట్టి నడిపిస్తోంది ఈ కవితా సంపుటి. 'అమెరికా వోడి తీపిముద్దులు / లాటిన్ సారవంత భూముల్లో / దేశదేశాల నుంచి తోలుకొచ్చిన / బానిసలు చెరుకు తోటలై / యజమాని కాఫీలో గింజలై / సరదా సిగరెట్టులో పొగాకై...' అంటూ రక్త మాంసాలు కరిగి, శ్వాస ఆగిన పొగగొట్టాల్లా పొలాల్లో, గనుల్లో ఘనీభవిస్తున్న ప్రాణుల సమీపాన పాఠకుల్ని నిలబెట్టిన కవితా పంక్తులు శ్వేతజాతి క్రూర బానిసత్వ కౌగిళ్ల ఆకారాలను అక్షరాలనిండా అందిస్తున్నాయి.

తనను తాను ఎంతో నమ్మకంగా వ్యాఖ్యానించుకొనే ఈ కవి... 'నేనే నేలని నేనే గాలిని నేనే నీరుని / నేనే అగ్నిని నేనే ఆకాశాన్ని / నేనే నువ్వెలిసిన వెన్నెలను / ఈ మట్టి చేతులు మద్దాడితే గదా / పంచభూతాలకొక పరమార్ధం... అంటున్నారు. ఈ కవి ప్రయోగించిన భావవ్యక్తీకరణలు మనిషి రక్తంనిండా ఒక చలనాన్ని నింపుతున్నాయి. మహా వాక్యాన్ని కూలదోసి కొత్త అక్షరాలతో ఊరంతా సువాసన వెదజల్లాలంటున్నాడు. కన్నీటిని ముద్దాడుతూ భయాన్ని భయపెట్టాలని మార్గనిర్దేశాలు చేస్తున్నాడు. నవ్వటం నేర్చుకోమని చెప్పుతూ... 'కన్నీళ్లని బిగబట్టినట్టు / చిరుగాలి సవ్వడి చేసినట్టు / అధికార ధ్వజస్తంభం నేలమట్టమైనట్టు / భావదాస్యం చెట్టు కూలిపోయినట్టు / గడ్డిమొక్క గాలిలో రెపరెపలాడినట్టు / వళ్లు వుడికేలా నవ్వటం నేర్వాలి...' అంటున్నాడు. మర్మగర్భంగా పలికిన ఈ మాటల లోతుల్లో ఒక సుదీర్ఘ పోరాటానికి అవసరమైన సరంజామా చాలా పెద్ద ఎత్తున సమకూర్చుకున్నట్లు అర్ధమవుతోంది.

కవిత్వాన్ని చాలామంది రాస్తున్నారు. కవిత్వాన్ని కళాత్మకంగా తీర్చిదిద్దే అరుదైన సాధకులలో కేశవకుమార్ ఒకరుగా తన స్థానాన్ని పదిలం చేసుకోవటం వెనక అపారమైన సామాజిక అధ్యయనం ఒక కారణంగా తన తోరణాలను అందంగా అలంకరించుకుంతోంది. ఈ రాతల్లో అమ్మపాలంత స్వచ్ఛత వుంది. డప్పు మ్రోగినంత ధైర్యముంది. పల్లెను కళేబరంలా వ్రేలాడదీస్తున్న ప్రపంచీకరణ మునివ్రేళ్లను తన పాదాలతో నలిపే ప్రయత్నానికి తన వూపిరికి సాహిత్యంతో కొత్త ప్రాణాన్ని అందిస్తున్నాడు కవి. ఒక లక్ష్యాన్ని సాధించటం కోసం... 'నన్ను నేను చూసుకుంటూ / నేనో కెమరానవుతా / నా ఫోటో ఫ్రేమ్ లో / హీరోని నేనే విలన్నీ నేనే / కవిని, ఋషిని, కవిత్వాన్ని / ప్రేమనీ, ద్వేషాన్నీ నేనే...' అంటూ తన కవిత్వంలో భావంనిండా తన రక్తాన్ని ప్రవహింపజేస్తున్నాడు. మనిషే మహాసత్యం, మోక్షాలన్నీ మోసాలు, కర్మ ఒక క్రూరానికి రూపం, ప్రచారం చేసే బ్రహ్మజ్ఞానాలన్ని మిధ్యలే... మనిషిని పరిమళింపజేసే జనసమూహాల్లో పునర్జన్మలేని పూర్ణ ప్రేమికుల్లా ప్రపంచమంతా ఈలేసుకుంటూ తిరుగుదాం రండి! అంటూ పిలుపునిస్తున్నాడు ఈ ప్రగతిశీల ప్రేమికుడు.

కేశవకుమార్ కవిత్వాన్ని చదివాక అందులోని వాక్యాలు రెక్కలు విరిగిన తూనీగ గుండె సవ్వడుల్ని మనకు వినిపిస్తున్నాయి. చరత్రపుటల నుండి రాలుతున్న అబద్ధాల అవశేషాల నుంచి అసలు నిజాల రూపాలు తిరిగి ప్రాణవాయువును పొంది ముత్తాత వేటకొడవలిని, నుప్పురాయిని చేత్తో త్రిప్పుతూ విన్యాసాలు చేస్తున్నాయి. గాయాలు మాట్లాడిన ప్రతి సందర్భంలోనూ...'ఎవడి బతుకు యుద్ధం / వాళ్లని చేసుకోనివ్వండి / యుద్ధ దారి మల్లించకండి / మీ తెలివైన అతి మాటలతో...' అంటూ మనుషులంటే ఘనీభవించిన కాలం కాదనే ఒక తీర్మానాన్ని కవి తనదైన శైలిలో చాలా బలంగా ప్రవేశపెడుతున్నాడు. ఈయన కవితలలోని పదాలలో అక్షరాలుండవు. అన్నీ ఆయుధాలే. 'ఇప్పుడు మా అస్తిత్వమే మాకు ప్రశ్న అవుతోంది...' అంటూ ఎర్రబడ్డ కవి చూపులనిండా కనిపిస్తున్న రక్త చారికలు రేపటి మేలుకొలుపుల పోరాట పాటలను వినిపిస్తున్నాయి. సామ్రాజ్య రోబోల మేధస్సు మీదెక్కి చిందులేసే మట్టిమనుషుల మహామానవ సామ్రాజ్య సరిహద్దులు కనపడుతున్నాయి.

ఒక పోరాటాన్ని తన కవిత్వానికి కవచాన్ని చేసి యోధుడిలా కలాన్ని ఖడ్గంలా త్రిప్పిన కేశవకుమార్ గళం నుండి తాకిన ప్రతి శబ్దం ఇన్నాళ్ల నిశ్శబ్దాన్నితునాతునకలు చేస్తోంది. వైవిధ్యాన్ని సుగంధంలా అద్దుకున్న ఈ కవి కవిత్వం ఇక్కడ ఒకప్పుడు భూగోళం ఉండేదన్న నిజాన్ని గుర్తుచేస్తోంది. భూమి, ఆకాశం, సూర్యుడు, చంద్రుడు సాక్షిగా దాచుకున్న కన్నీళ్లను రంగులుగా మార్చుకున్న కవితల్లోని పదజాలం, కాలవొడ్డున చెట్టు మీద ఒక పిట్ట పాడిన పాటను, ఆ పాట మైమరుపులో పొలం గట్టున నాగలి పట్టుకు నడిచిపోయే మట్టిమనిషి వర్ణచిత్రాలను చిత్రీకరిస్తోంది. ఆకాశం నిండా పరుచు నేలా, సముద్రపు హోరులో, సూర్యుడి సంగీతంలో అక్షరాలు నేరుగా మనిషి రూపంలోకి మారే చరిత్రకు 'ఎగిరే పళ్లెం, నడిచేమంచం, ఈ కూనిరాగం' సంపుటిలోని కవితలు రేపటి చరిత్రకు పేజీలుగా మారిపోతున్నాయి. ఈ సందర్భంగా సారవంతమైన సాహిత్యాన్నే కాదు, తన ఆగ్రహాన్ని, తన వేదనను, తన కన్నీళ్లను, తన తిరుగుబాటును చాలా సమర్థవంతంగా కవిత్వ రూపంలో అందించిన 'కేశవకుమార్' కు అభినందనలు.

- డాక్టర్ కె.జి. వేణు,
98480 70084

"ఎగిరే పళ్లెం, నడిచే మంచం, ఓ కూనిరాగం"
కవితా సంపుటి. పేజీలు: 174, వెల: Rs. 150/-
దొరుకుచోటు:
కేశవ కుమార్ , న్యూఢిల్లీ. 88263 94414

# వరంగల్ కలెక్టరేట్‌లో నేటి ప్రజావాణి రద్దు

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో సోమవారం (3.11.2025) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని పరిపాలన పరమైన కారణాల వల్ల రద్దు చేస్తున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా జరిగిన నష్టాల వివరాల సేకరణలో అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉన్నందున ప్రజావాణి ని రద్దు చేస్తున్నట్లు, జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి కలెక్టరేట్ కు రావద్దని కలెక్టర్ కోరారు.

# వరద బాధితులకు అండగా నిలిచిన జిల్లా మహేష్ బాబు యువసేన

**వరంగల్ జిల్లా అధ్యక్షులు గందె నవీన్**



**వరంగల్ మహా;** ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ, తమదైన శైలిలో పేదలకు ఎన్నో సేవలు అందిస్తూ తమ ధర్మాన్ని తాము నిర్వర్తిస్తున్న వరంగల్ జిల్లా మహేష్ బాబు యువసేన, వాసవి క్లబ్ వరంగల్ సెంట్రల్, తో పాటు శ్రీ శబరిమల సేవా సమాజ్ గందే నవీన్ అండ్ ఫ్రెండ్స్ యూనిట్ వారి ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ తూర్పు నియోజకవర్గం 28వ డివిజన్ లో ఇటీవల కురిసిన భారీ వర్షానికి నిరాశ్రయులయి అన్నీ కోల్పోయిన పేద మధ్య తరగతి ప్రజలకు అండగా నిలిచారు. వరద ముంపు ప్రాంతాలైన ఎన్టీఆర్ కాలనీ, బృందావన కాలనీలకు చెందిన 150 పేద మధ్య తరగతి కుటుంబాలకు సన్న బియ్యంతో పాటు 15 రకాల నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ ఎమ్మార్వో శ్రీకాంత్, 28 డివిజన్ కార్పొరేటర్ గందే కల్పన నవీన్ విచ్చేసి బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎమ్మార్వో మాట్లాడుతూ వరద బాధితులకు అండగా నిలిచిన మహేష్ బాబు జిల్లా అధ్యక్షులకు గందె నవీన్ కు వారి బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం 28వ డివిజన్ కార్పొరేటర్ గందే కల్పనా నవీన్ మాట్లాడుతూ ఈ ప్రాంతాల్లో గతంలో కూడా విపత్తులు వచ్చాయి కానీ ఈ సంవత్సరం ఇంత పెద్ద విపత్తు సంభవించిందని ఇది ఎంతో బాధాకరమని మీ అందరికీ నా వంతు సహాయంగా కొన్ని సేవా సంఘాల సహకారంతో సేవలు అందిస్తున్నామని, ముఖ్యంగా మీ అందరికీ న్యాయం జరిగేలా, ముంపుకు శాశ్వత పరిష్కారానికి స్థానిక కార్పొరేటర్ గా నా వంతు బాధ్యతతో ఈ విషయాన్ని అధికారుల దృష్టికి అలాగే ముఖ్యమంత్రి తో పాటు మంత్రుల దృష్టికి తీసుకు వెళ్లి శాశ్వత పరిష్కారానికి నేను కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం చేస్తున్నటువంటి మహేష్ బాబు ఫ్యాన్స్ లయన్స్ క్లబ్, వాసవి క్లబ్ వారికి డివిజన్ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలయజేశారు. ఈ కార్యక్రమంలో కొప్పుల అనిల్, శంకర్ సింగ్, బాగల్ కళ్యాణ్, కొత్త పెల్లి రాజేష్, ఉట్ల అఖిల్ పొకల రాము, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి, జిల్లా కలెక్టర్



**వరంగల్ మహా;** నెక్కొండ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఆదివారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద తో కలిసి పత్తి, మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులు వారు కోరుకున్న రోజే స్లాట్ బుకింగ్ చేసుకొని పత్తి తీసుకువస్తే కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అదే విధంగా ధ్యానం, మొక్కజొన్న రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయవద్దని అధికారులను,వ్యాపారులను ఆదేశించారు. రైతులు కూడా తేమ శాతం ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉండేలా చూసుకొని తీసుకురావాలని కోరారు.

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ...**

పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించాలని రైతులను కోరారు కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంట వివరాలను క్షేత్రస్థాయిలో అధికారులు నమోదు చేస్తున్నారని, పంట నష్టపోయిన రైతులు అధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్డీఓ రాంరెడ్డి,ఆర్డీవో ఉమారాణి , డీసీఓ నీరజ ,డీఎం సివిల్ సప్లయర్ సంధ్యారాణి , డీసీఎస్ఓ కిష్టయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, మార్కెట్ ఛైర్మన్లు పాలాయి శ్రీనివాస్, హరీశ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు సంపూర్ణ సహకారం అందిస్తాం

**నగర మేయర్ గుండు సుధారాణి**



**వరంగల్ మహా;** వరద ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులకు అన్ని విధాల సహకారం అందిస్తామని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఆదివారం వరంగల్ పరిధి లోని వరద ప్రభావానికి గురైన ఎన్టీఆర్ కాలనీ రామన్నపేట సంతోషిమాత కాలనీ ఫేజ్ 1, ఫేజ్ 2 గంగ పుత్ర కాలనీ ప్రాంతాలతో పాటు డిఆర్ నగర్, ఎస్ ఆర్ ఆర్ తోట, ప్రాంతాలలో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టపోయిన బాధితుల వివరాలను సక్రమంగా సమగ్ర సమాచారాన్ని అందించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదల వల్ల నష్టపోయిన గృహాలను గుర్తించి సంబంధిత సమాచారాన్ని నమోదు చేయడం జరుగుతుందని భారీ వర్షాల వల్ల ఏర్పడిన బురద తో పాటు చెత్త చెదారం తొలగింపు ప్రక్రియ విధానాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కొనసాగుతున్న అసెస్మెంట్ ను మేయర్ కమిషనర్ ఇరువురు పరిశీలించారు. వార్డు ఆఫీసర్లు రెవెన్యూ సిబ్బంది జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి అంచనా వేసి వాస్తవ సమాచారాన్ని అందజేయాలని వరంగల్ ప్రాంతంలో 5 జేసిబి లు హన్మకొండ ప్రాంతం లో 6 జేసీబీ లు, ట్రాక్టర్ ల సహాయంతో వరద వల్ల ఏర్పడిన బురదను తొలగించడం జరుగుతుందని అన్నారు. హన్మకొండ ప్రాంతంలోని ప్రగతి నగర్ వివేక నగర్ కాలనీ ప్రాంతాల్లో పర్యటించిన మేయర్ వరద ముంపుకు గురైన ప్రాంతాలలో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో సి ఎం హెచ్ ఓ డా.రాజా రెడ్డి, ఎం హెచ్ ఓ డా.రాజేష్, సానిటరీ సూపర్ వైజర్ లు గోల్కొండ శ్రీను, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# మంచి నీటి శుద్ధీకరణలో నిర్లక్ష్యం వద్దు

**నగరం మేయర్ గుండు సుధారాణి**



**వరంగల్ మహా;** నగర ప్రజలకు అందించే మంచి నీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని అలాగే ఫిల్టర్ బెడ్ లో మంచి నీటి శుద్ధీకరణ లో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. ఆదివారం హనుమకొండ పరిధి వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్, ధర్మసాగర్ రిజర్వాయర్లను మేయర్ ఆకస్మికంగా సందర్శించి నీటి సరఫరా తీరును పరిశీలించి తగు సూచనలు చేశారు. ఇటీవల తాగునీరు రంగు మారి వస్తున్నదని పలు ప్రాంతాలు నుండి ఫిర్యాదులు వచ్చిన దృష్ట్యా క్షేత్ర స్థాయిలో వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్, ధర్మసాగర్ రిజర్వాయర్ ను సందర్శించి నీటిని పరిశీలించడం జరిగిందని, ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ఎగువ ప్రాంతాల్లో నుండి చెరువుల నీరు రిజర్వాయర్ లో ప్రవేశించడం వల్ల కొద్దిగా రంగు మారిందని, రెండు రోజుల్లో నీటి రంగు సామాన్య స్థితికి వస్తుందన్నారు. నీరు కలుషితం కాకుండా అధికారులకు తగు చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారిచేసినట్లు మేయర్ తెలిపారు. అనంతరం వివేక్నగర్, సమ్మయ్య నగర్, అమరావతి నగర్ ప్రాంతాల్లో సందర్శించి మాట్లాడుతూ వరద నేపథ్యం లో అంటు వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాలని వరద ప్రభావిత ప్రాంతాలలో బ్లీచింగ్ పౌడర్ చల్లడం తో పాటు దోమల నివారణ చర్యలు చేపట్టి వ్యాధులు సంక్రమించకుండా చర్యలు చేపట్టాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి డి ఈ లు రాజ్ కుమార్ సారంగం సానిటరీ సూపర్ వైజర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు

# వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలి

**రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ డి రవీంద్ర నాయక్**



**హన్మకొండ మహా;** వరద ప్రభావిత ప్రాంతాలలో వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకుంటూ వైద్యాధికారులు సిబ్బంది, వచ్చే వారం రోజులపాటు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ డి రవీంద్ర నాయక్ ఆదేశించారు. హనుమకొండ వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ ఏ అప్పయ్య డాక్టర్ బి సాంబశివరావు లతో కలిసి ఆదివారం వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి అక్కడ తీసుకుంటున్న చర్యలు, నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి వైద్యాధికారి డాక్టర్ మాలిక ను గత మూడు రోజులుగా వారి పరిధిలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే వివరాలు , నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు చికిత్స నిమిత్తం ఎలాంటి సమస్యలతో వస్తున్నారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నీరు నిలువ ఉండడం , నీరు,ఆహార పదార్థాలు కలుషితం కావడం , పరిశుభ్రతకు సంబంధించిన సమస్యల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని వారం రోజుల పాటు అప్రమత్తంగా ఉంటూ ఇంటింటి సర్వే నిర్వహిస్తూ చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు చికిత్స అందిస్తూ అవసరమైన వారిని పిహెచ్సికి రిఫర్ చేయాలని అలాగే కలుషిత నీరు ఆహార పదార్థాల ద్వారా డయేరియా ,డీసెంట్రీ వంటి వ్యాధులు రాకుండా వారికి త్రాగునీరు అలాగే తినే ఆహార పదార్థాల గురించి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించాలన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ముఖ్య ఆరోగ్య అధికారి డాక్టర్ రాజారెడ్డి తీసుకుంటున్న చర్యలను వారికి వివరించారు. వరంగల్ నగరంలో ప్రాంతాలను పరిశీలించిన అనంతరం హనుమకొండ డిఎంహెచ్ఓ కార్యాలయంలో డి ఎం హెచ్ వో లు, ప్రోగ్రాం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పరిస్థితిని సమీక్షించిన అనంతరం వచ్చే వారం రోజులపాటు వైద్యాధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని , కలుషిత నీరు కలుషిత ఆహార పదార్థాల వలన అలాగే దోమల వలన వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ సిబ్బందితో సమన్వయంగా పనిచేస్తూ ఉండాలని, ప్రోగ్రాం అధికారులు క్షేత్రస్థాయిలో గృహ సర్వే, వైద్య శిబిరముల నిర్వహణ, పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవడంలో వైద్యాధికారులు, సిబ్బందితో సమన్వయంగా పని చేయించాలన్నారు. నీటి నిల్వల వలన లార్వా వృద్ధి చెంది దోమల ద్వారా వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది కాబట్టి కార్పొరేషన్ సిబ్బందితో సమన్వయంతో పనిచేస్తూ యాంటీ లార్వా నివారణ చర్యలు అలాగే ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ డిఎంహెచ్ఓ డాక్టర్ ఏ అప్పయ్య, వరంగల్ డిఎంహెచ్వో డాక్టర్ బి సాంబశివరావు, అడిషనల్ డీఎంహెచ్వో డాక్టర్ టి మదన్మోహన్ రావు , టీబీ నియంత్రణాధికారి డాక్టర్ హిమబిందు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఇక్త దార్ అహ్మద్ , డాక్టర్ జ్ఞానేశ్వర్,డాక్టర్ మంజుల, జిల్లా మాస్ మీడియా అధికారి వి అశోక్ రెడ్డివరంగల్ డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ ప్రకాష్ డాక్టర్ కొమురయ్య , డాక్టర్ మోహన్ సింగ్, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ ఉదయరాజ్ డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రిన్సిపల్ వేధింపులపై అధికారుల సుదీర్ఘ విచారణ

**విద్యార్థులను విచారించిన సాంఘిక సంక్షేమ శాఖ జోనల్ చైర్మన్ నిర్మల**

రెసిడెన్షియల్ కళాశాలను సందర్శించిన షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ

రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపల్ శైలజ తీరుపై సర్వత్ర విమర్శలు

విచారణ కమిటీ వేసి వాస్తవాలను విచారించి చర్యలు చేపడతామని ప్రకటించిన అధికారులు





**షాద్ నగర్, మహా:** షాద్ నగర్ పట్టణ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ నాగర్ కర్నూల్ గురుకుల కళాశాల విద్యార్థుల పట్ల ప్రిన్సిపల్ శైలజ అవలంబిస్తున్న తీరుపై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆదివారం కళాశాల విద్యార్థినిలు పెద్ద ఎత్తున షాద్ నగర్ చౌరస్తా, 44 నెంబర్ జాతీయ రహదారిపై ఆందోళనలు గంటల పాటు నిర్వహించిన సంగతి విధితమే. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శైలజ వ్యవహార తీరును తప్పుపడుతూ విద్యార్థులు చర్యలు చేపట్టాలంటూ న్యాయం కోసం రోడ్డు ఎక్కారు. ఈ నేపథ్యంలో సాంఘిక సంక్షేమ శాఖ జోనల్ చైర్మన్ నిర్మల అదేవిధంగా స్థానిక ఏసిపి లక్ష్మీనారాయణ పట్టణ సిఐ విజయ్ కుమార్ తదితరుల సహకారంతో విద్యార్థులను ఆందోళన శాంతింపజేసి వారి సమస్యలను వేరువేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో కళాశాల భవనానికి చేరుకున్న సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో పాటు ఏసిపి లక్ష్మీనారాయణ సిఐ విజయకుమార్ తదితరులు అక్కడికి చేరుకొని విద్యార్థుల సమస్యలను వారితో అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో ప్రిన్సిపల్ శైలజ విద్యార్థుల పట్ల వ్యవహరిస్తున్న వేధింపులకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు సంక్షేమ శాఖ అధికారులతో పాటు స్థానిక పోలీసులకు దృష్టికి తీసుకోవచ్చారు. విద్యార్థుల దగ్గర ఫీజులు అనైతికంగా వసూలు చేయడం, వంట సరుకులు దొంగతనంగా బయటకి తరలించడం, అదేవిధంగా భోజనాలకు సంబంధించి తమకు ఇబ్బందులకు గురి చేయడం అనేక అక్రమాలతో పాటు బెదిరింపులు వసూళ్లకు పాల్పడుతున్న ప్రిన్సిపల్ శైలజ పై చర్యలు తీసుకోవాలని దీనికి సంబంధించిన అనేక ఆధారాలు కూడా విద్యార్థుల వద్ద ఉన్నట్లు ఈ విచారణలో పేర్కొన్నారు. పోలీసులతోపాటు సాంఘిక సంక్షేమ అధికారులు కూడా విద్యార్థులను వేర్వేరుగా అనేక విషయాలు అడిగి తెలుసుకున్నారు. వివాదాస్పదంగా మారిన ఈ సంఘటన పట్ల పోలీస్ శాఖ కూడా ప్రిన్సిపల్ వ్యవహరిస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులతో పాటు రెసిడెన్షియల్ సిబ్బందితో ఏసిపి లక్ష్మీనారాయణ, సీఐ విజయ్ కుమార్ సైతం మాట్లాడి వాస్తవాలను విచారించారు. విద్యార్థులు రోడ్లపైకి రావడం మంచి పరిణామం కాదని ఏవైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారులు వెంటనే శాఖ పరంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు రోడ్లపైకి వచ్చి శాంతిభద్రతలకు భంగం కల్పిస్తే ఇలా అని పోలీసులు తమదైన శైలిలోనే సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బందిని మందలించారు. విద్యార్థుల సమస్యల పట్ల ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించాలని అదేవిధంగా వాస్తవాలు ఏమిటో తెలుసుకోవాలని విద్యార్థులు రోడ్లపైకి రావడం మంచి పరిణామం కాదని పోలీసులు సంబంధిత శాఖ అధికారులకు తెలియజేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగిన పరిణామాలను ఈ సందర్భంగా విచారించారు. ఉదయం నుండి విద్యార్థులు ఎలాంటి అన్నపానీయాలు ముట్టకోకుండా న్యాయం కోసం కళాశాల ముందు కూడా బిస్మించుకో కూర్చున్నారు. పోలీస్ స్టేషన్ నుండి ప్రత్యేక వాహనాల్లో కళాశాలకు తరలించిన విద్యార్థులు ఆ తర్వాత కళాశాల లోపటికి వెళ్లకుండా బయట బైఠాయించారు. ఈ సందర్భంగా మరోసారి సంబంధిత శాఖ అధికారులు అదేవిధంగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు. ఈ సంఘటనపై విచారణ కమిటీ నియమించి ఉన్నతాధికారులకు వాస్తవాలు తెలియజేస్తామని విద్యార్థులు శాంతించాలని యధావిధిగా చదువులు కొనసాగించాలని అధికారులు కోరుతున్నారు.

# బల్దియాలో నేటి ప్రజావాణి రద్దు

**కమిషనర్ చాహత్ బాజ్ పాయి**

**వరంగల్ మహా;** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రేటర్ వరంగల్ లో జలమయమైన ప్రాంతాల్లో శానిటేషన్, పునరుద్దరణ, వాటిల్లిన నష్టం నమోదులో బల్దియా అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉన్నందున నవంబర్ 3 తేదీన (సోమవారం) జిడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిడబ్ల్యూఎంసీ కమిషనర్ కమిషనర్ చాహాత్ బాజ్ పాయి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి గ్రేటర్ వరంగల్ నగర ప్రజలు ఫిర్యాదులు ఇచ్చుటకు బల్దియా కార్యాలయానికి రాకూడదని కమిషనర్ ప్రకటనలో కోరారు.

# మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం సంగెం మండలంలోని గవిచర్లలో గల తెలంగాణ బాలికల మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూంలను పరిశీలించి సదుపాయాలను గమనించారు. బియ్యం నిల్వలు, కూరగాయల నాణ్యత, సరుకుల స్టాక్ ను క్షుణ్ణంగా పరిశీలించారు. తాజా కూరగాయలు వినియోగించాలని, ఈగలు, దోమల బెడద లేకుండా పాఠశాల సముదాయాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల్లో గల ముళ్ల పొదలను తొలగించాలని, ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మెనూ పట్టికను పరిశీలించి, విద్యార్థినులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే ఏర్పాటుచేసిన ఫిర్యాదుల పెట్టెలో వేయాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా రెసిడెన్షియల్ పాఠశాలలో కావలసిన సదుపాయాల గురించి విద్యార్థులు కలెక్టర్ దృష్టికు తీసుకోరగా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డిబిసిడిఓ పుష్పలత, తహసీల్దార్ రాజ్ కుమార్, వార్డెన్, తదితరులు ఉన్నారు..

# షాద్ నగర్ జాతీయ రహదారిపై విద్యార్థుల మెరుపు ధర్నా





**షాద్ నగర్, మహా:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో నిర్వహిస్తున్న నాగర్ కర్నూల్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ విద్యార్థినిలు వందలాది మంది రోడ్లపైకి వచ్చి మెరుపు ధర్నాకు దిగారు. గురుకుల లో జరుగుతున్న అవినీతి అక్రమాలు అదేవిధంగా తదితర అంశాలపై వారు గుంతెత్తి చాటుతూ ఆదివారం ఉదయం తొమ్మిది గంటల 45 నిమిషాలకు రోడ్డుపైకి వచ్చారు. విద్యార్థినీలను ఆందోళన నుంచి ఆపడానికి అధ్యాపక బృందం విపరీతంగా ప్రయత్నం చేసింది. కానీ విద్యార్థినిలు వారిని లెక్కచేయకుండా రోడ్లపైకి వచ్చి న్యాయం చేయాలి అంటూ గుంతెత్తి చాటారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని కమ్మదనం శివారులో నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో నిర్వహిస్తున్న నాగర్ కర్నూల్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయ ఆయా సంస్థల విద్యార్థినిలు వందలాదిగా గురుకులం నుండి పాదయాత్రగా నడుచుకుంటూ వచ్చి షాద్ నగర్ పట్టణంలోని బైపాస్ రహదారిపై కూర్చున్నారు. ముందు అక్రమాలు ఆపండి ఆ తర్వాత విద్యను అందించండి అంటూ ప్లే కార్డ్స్ లను విద్యార్థులు ప్రదర్శించారు. అదే విధంగా లంచగొండితనాన్ని రూపుమాపాలి అంటూ ప్లే కార్డులపై రాశారు. ప్రిన్సిపల్ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ రోడ్లపైకి దూసుకొరావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. రోడ్డుపైకి దూసుకువస్తున్న విద్యార్థులను చూసి వాహనదారులు కంగు తిన్నారు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉండడంతో సమాచారం అందుకున్న పోలీసులు కూడా సంఘటన స్థలానికి చేరుకొని వారినిబి ఆందోళన వినిపింపజేసే దిశగా ప్రయత్నాలు జరుపుతున్నారు అయితే విద్యార్థులు మాత్రం ససేమిరా వినడం లేదు.

# కేతిరెడ్డిపల్లిలో అయ్యప్ప మహా పడిపూజ



**మొయినాబాద్ మహా:** స్వామి శరణం అయ్యప్ప శరణం శరణం శరణం అయ్యప్ప అంటూ కేతిరెడ్డిపల్లి గ్రామంలో అయ్యప్ప సామి మహా పడిపూజ మార్మోగింది. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంకరమని శీను గురుస్వామి అయ్యప్ప స్వామి మహా పడిపూజ 18 మెట్ల పై కర్పూర హారతిని వెలిగించారు. ఈ సందర్భంగా కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీశైలం గురుస్వామి అయ్యప్ప మహా పడిపూజ ముందుగా గణపతి హోమము, గణపతి పూజ, కుమారస్వామి పూజ నిర్వహించి.అయ్యప్ప స్వామికి పూలు పండ్లు, నూతన వస్త్రాలు, నైవేద్యం సమర్పించి మంగళహారతిని సమర్పించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ అయ్యప్ప నామ స్మరణతో మర్మోగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి అయ్యప్ప స్వాములు పాల్గొని అయ్యప్ప భక్తి పాటలతో భజనలు నిర్వహించారు. దీంతో గ్రామంలో అయ్యప్ప నామస్మరణంతో భక్తులు ఎంతో ఆనందంతో తిలకించారు. అనంతరం స్వామివారి దర్శనం భక్తులందరికీ తీర్థ ప్రసాదములు అన్న ప్రసాదములు సమర్పించారు. ఈ సందర్భంగా కేతిరెడ్డిపల్లి గ్రామంలో అయ్యప్ప భక్తుల సందడి నెలకొన్నది.

# కాటేదాన్ ఇండోర్ స్టేడియంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ బ్యాడ్మింటన్ ప్రాక్టీస్



**రాజేంద్రనగర్, మహా ;** రోజువారి వ్యాయామంలో భాగంగా కాటేదాన్ ఇండోర్ స్టేడియం స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి ) కమిషనర్ ఆర్ వి కర్ణన్ బ్యాట్మెంటన్ క్రీడాకారులతో కలిసి ఆదివారం గంట సేపు బ్యాట్మెంటన్ ఆడారు. కాటేదాన్ ఇండోర్ స్టేడియం స్పోర్ట్స్ కాంప్లెక్స్ సదుపాయాలతో క్రీడాకారులకు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రతి రోజు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కనీసం గంట కేటాయించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ తెలిపారు. క్రీడాకారుల కోసం సర్వాంగ సుందరంగా కాటేదాన్ ఇండోర్ స్టేడియం స్పోర్ట్స్ కాంప్లెక్స్ ని సిద్ధం చేశాము. కావలసిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు. త్వరలోనే స్విమ్మింగ్ పూల్ తో పాటు ఇతర అంశాలపై దృష్టి సారించాం, వాటి పనులను త్వరలోనే చేపడతామన్నారు. జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ రాకతో క్రీడాకారులు నూతన ఉత్తేజం పొందారు. గేమ్స్ ఇన్స్పెక్టర్ సౌత్ జోన్ రాఫ్ అలీ, కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇంచార్జ్ శ్రీకాంత్, ఇక్బాల్, ఆషం, బ్యాట్మెంటన్ క్రీడాకారులు తదితరులు.

**భద్రయ్య యోగా గురువు..**

గత 20 సంవత్సరాల నుంచి యోగ మొదలుపెట్టాము. సుమారు 50 మంది వరకు ప్రజనిత్యం కాటేదాన్ ఇండోర్ స్టేడియం స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో యోగా చేస్తూన్నాము. ఇప్పటివరకు ఏ అధికారి రాలేదు. గత వారం రోజుల నుంచి కమిషనర్ ఆర్ వి కర్ణన్ వస్తున్నారు వారి రాకతో ఇండోర్ స్టేడియం అభివృద్ధి వైపు దృష్టి సారిస్తారని ఆశిస్తున్నామన్నారు.

# ఆటో డ్రైవర్ అనుమానాస్పద మృతి

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు**


**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం కాశిబుగ్గ లోని శాంతినగర్‌లో ఓ ఆటో డ్రైవర్ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన పై మృతుడి తల్లి ఎండి రేహానా (60) ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇంతే జార్గంజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంతేజార్గంజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రేహానా అక్టోబర్ 24తేదిన తన చెల్లెలి భర్త ఘౌస్ పాషా అనారోగ్యంతో ఉన్నందున హన్మకొండకు వెళ్లి అక్కడే కొన్ని రోజులు గడిపింది. అక్టోబర్ 27న ఉదయం 8 గంటల సమయంలో వారి ఇంట్లో కిరాయికి ఉంటున్న రెజియా అనే మహిళ, రేహానా కుమారుడు ఎండి. అహ్మద్ ఖాన్ (38) తల భాగంలో గాయాలతో, రక్తస్రావంతో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని ఫోన్ ద్వారా రేహానాకు సమాచారం అందించింది. తక్షణమే ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు అహ్మద్ ఖాన్ ను ఎంజిఎం ఆసుపత్రికి తరలించారు. కాగా మరలా అక్కడి నుంచి వరంగల్ సంరక్ష హాస్పిటల్ కు తరలించగా వారు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని సూచించగా వెంటనే అతనిని తరలించారు. అయితే చికిత్స పొందుతూ నవంబర్ 1వ తేదీ సాయంత్రం 7.17 గంటలకు అహ్మద్ ఖాన్ మృతిచెందాడు. తన కుమారుడు తల, ముఖ భాగాల్లో తీవ్ర గాయాలతో మృతి చెందాడని, ఈ ఘటన వెనుక గల కారణాలను గుర్తించి తమకు న్యాయం చేయాలని రేహానా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. దీని ఆధారంగా ఇంతేజార్గంజ్ పోలీసులు కేసు నమోదు చేసి క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ ఎంఏ షుకూర్ ప్రకటనలో తెలిపారు.



# ఇంటికి వాస్తు బాగుంటేనే సరిపోదు..

వాస్తు.. ఇంటి ఎంపికలో కీలకం. వాస్తును విశ్వసించే వారు అన్నీ అనుకూలంగా ఉంటే తప్ప కొనేందుకైనా, అద్దెకుండేందుకైనా నిర్ణయానికి రారు. అయితే ఇంటికి వాస్తు బాగుంటేనే సరిపోదని, పరిసరాల ప్రభావం కూడా ఇంటిపై, అందులోని నివాసితులపై ప్రభావం చూపిస్తుందని వాస్తు నిపుణులు చెబుతున్నారు. ఇంటి చుట్టుపక్కల, సమీపంలో శ్మశానం, ఆస్పత్రులు ఉంటే కొందరిలో మానసిక ఆందోళనలకు దారితీయవచ్చు. ఏదో రూపంలో ఏదో ఒక సమయంలో మనసుపై ప్రభావం చూపే వీలుంది. లేనిపోని భయాందోళనలకు గురవుతుంటారు. ఇది ఆరోగ్యంపై దుష్ప్రభావాన్ని చూపిస్తుంది. అలాగే మురుగు కాల్వలు, భారీ శబ్ధాలు చేసే కాలుష్య కర్మాగారాలు వంటివి కూడా నివాసితులపై ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉంటుంది. అందుకే సాధ్యమైనంత వరకూ వీటికి దూరంగా ఉండటమే ఉత్తమమని చెబుతుంటారు.

# ఐదేళ్లలో.. 5 లక్షల ఉద్యోగాలు: గడ్కరీ



మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో.. వచ్చే ఐదేళ్లలో ఐదు లక్షల ఉద్యోగాలను స్థానిక పరిశ్రమలు సృష్టించాలని కేంద్ర మంత్రి 'నితిన్ గడ్కరీ' పేర్కొన్నారు. ఈ లక్ష్యం సవాలుతో కూడుకున్నదే అయినప్పటికీ, సాధించవచ్చని ఆయన అన్నారు. 'నాగ్‌పూర్ స్కిల్ సెంటర్' ప్రారంభోత్సవంలో గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఐదేళ్లలో నైపుణ్య శిక్షణ.. ఐదు లక్షల ఉద్యోగాలను సృష్టించడం అనే లక్ష్యం చాలా పెద్దది అయినప్పటికీ లక్ష్యాన్ని చేసుకోవచ్చు. నాగ్‌పూర్‌లోని మల్టీమోడల్ ఇంటర్నేషనల్ కార్గో హబ్ అండ్ విమానాశ్రయంతో సహా.. పెద్ద ఎత్తున ఉద్యోగాలను అందించిన వివిధ ప్రాజెక్టుల ఉదాహరణలను ఆయన వివరించారు, ఇవి లక్ష ఉపాధి అవకాశాలను సృష్టించినట్లు గడ్కరీ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఉద్యోగాల కోసం నగరాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా.. వారికి శిక్షణ అందించడానికి నాగ్‌పూర్ నైపుణ్య కేంద్రాన్ని కోర్సులు ప్రారంభించాలని ఆయన సూచించారు.

టాటా స్ట్రైవ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (COO) అమేయా వంజరి మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగాల కోసం పరిశ్రమసంబంధిత శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. సంస్థ వందలాది మంది యువతకు ఉపాధి కల్పించడంలో సహాయపడుతుంది, గత 11 సంవత్సరాలలో 2.5 మిలియన్లకు పైగా విద్యార్థులు ఈ కార్యక్రమాల ద్వారా ప్రయోజనం పొందారని ఆయన వివరించారు. మేము తయారీ, విద్యుత్, సౌర, ఐటీ, బ్యాంకింగ్ రంగాలలో రెండు నుంచి మూడు నెలల కోర్సులను రూపొందించాము. వీటి తర్వాత ఉద్యోగ శిక్షణ.. నియామక అవకాశాలు ఉంటాయి. ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని నేను నాగ్‌పూర్ యువతను కోరుతున్నానని అమేయా వంజరి అన్నారు.

# కొత్త స్కూటర్ అమ్మకాల నిలిపివేత!

ఓలా ఎలక్ట్రిక్ ట్రేడ్ సర్టిఫికేట్‌ను సస్పెండ్ చేస్తూ గోవా రవాణా శాఖ కీలక ప్రకటన చేసింది. సరైన సర్వీస్ లేకపోవడం, మరమ్మత్తు జాప్యాలపై కస్టమర్ల నుంచి ఫిర్యాదులు పెరుగుతున్న నేపథ్యంలో.. రాష్ట్రంలో అన్ని కొత్త స్కూటర్ల అమ్మకాలను కూడా నిలిపివేసింది. గోవాలోని మూడు సర్వీస్ సెంటర్లలో దాదాపు 2,000 ఓలా స్కూటర్లకు సరైన మరమ్మత్తులు చేయకపోవడమే కాకుండా.. సిబ్బంది నుంచి సరైన స్పందన రావడం లేదని కస్టమర్లు చెబుతున్నారు. అస్పష్టమైన ప్రతిస్పందనలు & రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు ఆలస్యమయ్యాయని కస్టమర్లు ఫిర్యాదు చేస్తున్నారు. దీనిపై చర్య తీసుకోవాలని.. రవాణా శాఖకు, ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌కు ఓలా ఎలక్ట్రిక్ వినియోగదారులు మెమోరాండం సమర్పించారు. దీంతో రాష్ట్ర వాహన్ పోర్టల్‌లోని అన్ని ఓలా ఎలక్ట్రిక్ రిజిస్ట్రేషన్‌లను బ్లాక్ చేస్తూ సంబంధిత శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ సస్పెన్షన్ తాత్కాలికమని.. సమస్యలను పరిష్కరించిన తరువాత, దీనిని ఎత్తివేయనున్నట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు. ఈ చర్య గోవాలోని ఎలక్ట్రిక్ వాహన యజమానులలో చర్చలకు దారితీసింది. చాలామంది ఎలక్ట్రిక్ వాహన తయారీదారులకు బాధ్యత అలవాడాలని, జవాబుదారీతనం ఉండాలనే కఠినమైన చర్య తీసుకోవడం జరిగిందని అధికారులు పేర్కొన్నారు.



# నియామకాలు మళ్లీ షురూ!..

## సత్య నాదెళ్ల



ఇప్పటి వరకు ఉద్యోగులను తొలగిస్తున్న దిగ్గజ కంపెనీలు.. ఉద్యోగ నియమకాలను చేపట్టడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ తరుణంలో మైక్రోసాఫ్ట్ తన ఉద్యోగులను మళ్ళీ విస్తరించడానికి సిద్ధంగా ఉందని సీఈఓ సత్య నాదెళ్ల పేర్కొన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో.. కంపెనీ మరింత వృద్ధి చెందడమే లక్ష్యంగా ఉద్యోగ నియామకాలను చేపట్టనున్నట్లు మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల.. బీజీ2 పాడ్‌కాస్ట్‌లో వెల్లడించారు. కొత్తగా చేరే ఉద్యోగులకు ఏఐ గురించి బాగా అవగాహన ఉండాలని, వారికి మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్, గిట్‌హబ్ ఏఐ కోడింగ్ హెల్పర్ వంటి వాటికి సంబంధించిన యాక్సెస్ ఇవ్వనున్నట్లు కూడా ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులు ఏఐ సాయంతో.. మరింత వేగంగా పనిచేయడానికి కంపెనీ సన్నద్ధమవుతోంది స్పష్టం చేశారు. 2025 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి.. మైక్రోసాఫ్ట్ ఉద్యోగుల సంఖ్య 2,28,000గా ఉంది. అంటే అంతకు ముందు కంపెనీ సుమారు 15,000 మంది ఉద్యోగులను తొలగించింది. 2022 తరువాత కంపెనీ నియమాలను బాగా తగ్గించింది. అయితే ఇప్పుడు ఏఐ రంగంలో దూసుకెళ్లడానికి.. నైపుణ్యం కలిగిన ఉద్యోగులను నియమించుకోవాలని చూస్తోంది. అయితే ఎంత మందిని నియమించుకోనుందనే విషయాన్ని వెల్లడించలేదు.

# బంగారం ధరల్లో ఊహించని మార్పులు




డాలర్ విలువ పెరగడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గడం, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ రేటు తగ్గింపు వంటివన్నీ బంగారం ధరలు తగ్గడానికి ప్రధాన కారణమయ్యాయి. దీంతో గోల్డ్ రేటు వరుసగా రెండోవారం కూడా తగ్గుతూనే ఉంది. డిసెంబర్ నాటికి ఈ రేట్లు మరింత తగ్గే అవకాశం ఉందని అంచనా. రూ. 1,25,000 దాటేసిన 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేటు క్రమంగా తగ్గుతూ.. ఈ రోజు (నవంబర్ 02) రూ. 1,23,000 వద్ద నిలిచింది. ధరల తగ్గుదల ఇదే విధంగా కొనసాగుతుందని నిపుణులు చెబుతున్నారు. గ్లోబల్ మార్కెట్లో గరిష్ఠ స్థాయి నుంచి ఔన్సుకు 4,000 డాలర్ల స్థాయికి చేరిందని.. స్మాల్ కేస్ ఇన్వెస్ట్మెంట్ మేనేజర్ అండ్ వెల్త్ ట్రస్ట్ క్యాపిటల్ సర్వీసెస్ వ్యవస్థాపకురాలు & సీఈఓ స్నేహ జైన్ అన్నారు.

**ధరలు తగ్గడానికి కారణమైన అంశాలు**

అక్టోబర్ ప్రారంభంలో బంగారం కొంతకాలం జీవిత కాల గరిష్ఠాలను తాకిన తర్వాత ఈ తగ్గుదల నమోదైంది. ఈ వారం పరిణామాలు బంగారం విషయంలో చాలావరకు ప్రతికూలంగా ఉన్నాయని రిటైల్ బ్రోకింగ్ & డిస్ట్రిబ్యూషన్ సీఈఓ అండ్ పీఎల్ క్యాపిటల్ డైరెక్టర్ సందీప్ రైచురా అన్నారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గాయి, ట్రంప్‌జిన్‌పింగ్ చర్చలు సానుకూలంగా ఉన్నాయి. భారతదేశంలో పండుగ సీజన్ కూడా ముగిసింది. ఈ అంశాలన్నీ స్వల్పకాలంలో బంగారంపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయని ఆయన పేర్కొన్నారు.

**ఊహకందని మార్పులు**


రెండు వారాల పాటు ఒడిదుడుకుల తర్వాత వెండి ధరలు తిరిగి స్థిరత్వాన్ని ప్రదర్శించాయి. అక్టోబర్ నెలలో రూ. 2 లక్షలు దాటేసిన సిల్వర్ రేటు రూ. 1.66 లక్షలకు చేరింది. ఈ ధర మరింత తగ్గుతుందని వెల్త్‌ట్రస్ట్ క్యాపిటల్ సర్వీసెస్‌కు చెందిన జైన్ పేర్కొన్నారు. కాగా భవిష్యత్తులో రేట్ల తగ్గుదల అనేది.. స్థూల ఆర్థిక డేటాపై ఆధారపడి ఉంటాయని ఫెడ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ చేసిన వ్యాఖ్యలు లోహాల ర్యాలీని చల్లబరిచాయని వెంచురాలోని కమోడిటీస్ & సీఆర్ఎం హెడ్ ఎన్ఎస్ రామస్వామి అన్నారు. మొత్తం మీద పసిడి ధరలలో ఊహకందని మార్పులు జరిగే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు.

**తగ్గిన దిగుమతి ధరలు**

కేంద్ర ప్రభుత్వం బంగారం, వెండి బేస్ దిగుమతి ధరలను తగ్గించింది. బంగారం దిగుమతి ధర 10 గ్రాములకు 42 డాలర్లకు తగ్గింది. వెండి దిగుమతి ధర కేజీకి 107 డాలర్లకు తగ్గింది. ఈ నిర్ణయం ప్రపంచ మార్కెట్లో ధరల హెచ్చుతగ్గుల దృష్ట్యా తీసుకున్నది. దీని ఉద్దేశం దేశీయ మార్కెట్లో ధరలను స్థిరంగా ఉంచడం, వాణిజ్యాన్ని ప్రోత్సహించడం. తద్వారా ధరలలో వ్యత్యాసం కనిపిస్తోంది.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL





# ప్రపంచంలోనే అతిపెద్ద ఈజిప్ట్ మ్యూజియం ప్రారంభం

ఘన చరితను కళ్లకు కట్టినట్లు చూపుతున్న గ్రాండ్ ఈజిప్షియన్ మ్యూజియం

శనివారం నుంచి సందర్శకులకు అందుబాటులోకి..

2.58లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో లక్షకుపైగా వస్తువుల ప్రదర్శన

**కైరో:** పిరమిడ్లు మొదలు మమ్మీలు, ఫారో చక్రవర్తుల దాకా ఎన్నో ప్రత్యేకతలున్న ఈజిప్ట్ మరోసారి అంతర్జాతీయ పురావస్తు ప్రపంచంలో తనదైన ముద్ర వేసేందుకు బయల్దేరింది. ప్రపంచంలోనే అతి పెద్దదైన 'గ్రాండ్ ఈజిప్షియన్ మ్యూజియం'ను దేశాధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ అల్-సిసీ ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో పలు దేశాల అగ్రనేతలు, రాజకుటుంబీకులు పాల్గొన్నారు. వేల సంవత్సరాల ఈజిప్ట్ ఘన చరిత్రను అందరికీ తెలియజేసేలా ఆనాటి రాజరిక సంబంధ అన్ని రకాల పురాతన వస్తువులను ఈ మ్యూజియంలో ప్రదర్శించనున్నారు. ఈజిప్ట్‌ను పరిపాలించిన 30 రాజవంశాలకు సంబంధించిన ప్రాచీన వస్తుసంపదను సందర్శకులు ఈ మ్యూజియంలో చూడొచ్చు. దేశ పర్యాటక రంగానికి పునర్వైభవ తేవడంతోపాటు ఆర్థికాభివృద్ధికి ఊతమిస్తుందనే ఉద్దేశంతో ఈ మ్యూజియంను నిర్మించారు. ఈ మ్యూజియం నిర్మాణం 2005లో మొదలైంది. అయితే దేశంలో నెలకొన్న రాజకీయ అస్థిరత ఈ మ్యూజియం నిర్మాణం ముందుకు సాగనివ్వలేదు. పాక్షికంగా పనులు జరగడం, తర్వాత ఆగడం పరిపాటిగా మారింది. ఎట్టకేలకు ఇటీవలే మ్యూజియం నిర్మాణం పూర్తయింది. కైరో నగర శివారులో లక్షలాది మంది సందర్శకులకు అనువుగా సకల సదుపాయాలతో దీనిని కట్టారు. నవంబర్ 4వ తేదీ నుంచి సాధారణ పర్యాటకులను లోపలికి అనుమతిస్తారు. ఈజిప్ట్ నాగరికత విశిష్టతను కళ్లకు కట్టేలా 1,00,000కుపైగా పురాతన వస్తువులను ప్రదర్శిస్తున్నారు. కేవలం ఒక్క దేశ నాగరికతను చూపే ప్రపంచంలోనే అతి పెద్ద మ్యూజియంగా ఇది రికార్డులకెక్కనుంది. ది గ్రేట్ గిజా పిరమిడ్‌కు అత్యంత సమీపంలో దీనిని కట్టారు. గాజు పలకలతో పిరమిడ్ ఆకృతిలో నిర్మించారు.

### వేల కోట్ల రూపాయల వ్యయంతో..

పిరమిడ్ ఆకృతిలో 2,58,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో దాదాపు రూ.8,878 కోట్ల వ్యయంతో ఈ మ్యూజియం కట్టారు. మలేరియా, ఎముక వ్యాధితో వేల ఏళ్ల క్రితం కన్నుమూసిన, శాపాలకు ప్రసిద్ధిచెందిన ఈజిప్ట్ యువరాజు కింగ్ టుటెంక్‌మెన్ మమ్మీ సహా ఎన్నో వస్తువులు ఈ మ్యూజియంలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.

# షెన్‌జెన్ వేదికగా తదుపరి అపెక్ శిఖరాగ్రం: జిన్‌పింగ్



**బీజింగ్:** వచ్చే ఏడాది నవంబర్‌లో జరిగే ఆసియా పసిఫిక్ ఆర్థిక సమాఖ్య(అపెక్) దేశాల నేతల శిఖరాగ్రానికి షెన్‌జెన్ వేదిక కానుందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చెప్పారు. శనివారం ఆయన దక్షిణ కొరియాలోని గియాంగ్జులో జరుగుతున్న అపెక్ సమావేశంలో ఈ విషయం ప్రకటించారు. ఈ మేరకు అపెక్ దేశాలు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నాయి. పసిఫిక్ తీరంలో ఒకప్పుడు చేపల వేటకు మాత్రమే పరిమితమైన షెన్‌జెన్ కొన్ని దశాబ్దాల్లోనే అంతర్జాతీయ స్థాయి నగరంగా మారిందని జిన్‌పింగ్ అన్నారు. ఆసియా-పసిఫిక్ ప్రాంత దేశాల ఆర్థిక వ్యవస్థలు పరస్పర ప్రయోజనకరమైన సహకారాన్ని బలోపేతం చేయాలి. కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలి. సవాళ్లను ఎదుర్కొంటూ సుస్థిరమైన, సంపద్వంతమైన భవిష్యత్తును సృష్టించాలి'అని జిన్‌పింగ్ పిలుపునిచ్చారని చైనా అధికార వార్తా సంస్థ జిన్హువా తెలిపింది.

# అవి బందీల అవశేషాలు కావు: ఇజ్రాయెల్



**జెరూసలేం:** హమాస్ ఈ వారంలో రెడ్ క్రాస్ ప్రతినిధులకు అందజేసిన అవశేషాలు బందీలవి కావని ఇజ్రాయెల్ పేర్కొంది. ఇజ్రాయెల్ తమ వద్ద ఉన్న 30 మంది పాలస్తీనియన్ల మృతదేహాలను గాజాలో అందజేసింది. ప్రతిగా శుక్రవారం హమాస్ శ్రేణులు ముగ్గురు బందీల అవశేషాలను రెడ్ క్రాస్ ప్రతినిధులకు అందజేశారు. ఇజ్రాయెల్ అధికారులు పరీక్షలు జరిపి అవి బందీలవి కావని తేల్చారు. ఇదే విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ శనివారం ప్రకటించారు. ఆ అవశేషాలు ఎవరివనే విషయం తేలాల్సి ఉంది. అక్టోబర్ 10న కాల్పుల విరమణ అమల్లోకి వచ్చాక, 17 మంది బందీలను హమాస్ విడుదల చేసింది. చిట్టచివరిగా 11 మంది మృతదేహాల అప్పగింత ప్రక్రియ చాలా నెమ్మదిగా సాగుతోంది. ఇజ్రాయెల్ అందజేసిన 225 మంది పాలస్తీనియన్ల మృతదేహాల్లో 75 మందిని మాత్రమే కుటుంబాలు గుర్తించాయని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది.

# నెల రోజుల్లో రూ.62 వేల కోట్లు ఆవిరి

## అమెరికాలో షట్‌డౌన్ ప్రభావం




**వాషింగ్టన్:** అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్‌తో అగ్రరాజ్యంలో గత నెల రోజుల్లో 7 బిలియన్ డాలర్ల మేర (సుమారు రూ. 62,100 కోట్లు) సంపద ఆవిరైపోయింది. కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ (సీబీవో) అంచనాల ప్రకారం ఈ గణాంకాలు అక్టోబర్ 1న షట్‌డౌన్ ప్రారంభమైనప్పటి నుంచి నాలుగు వారాలకు సంబంధించినవి. కాగా ఇదే తీరు కొనసాగితే ఆరు వారాలకు 11 బిలియన్ డాలర్లు, ఎనిమిది వారాలకు 14 బిలియన్ డాలర్ల మేర ఆర్థిక నష్టం ఏర్పడవచ్చని సీబీవో అంచనా వేసింది. పది లక్షల మంది పైగా ఉద్యోగులకు జీతభత్యాలు లేకపోవడం వల్ల షట్‌డౌన్ సమయంలో వస్తువులు, సర్వీసుల కొనుగోళ్లు పడిపోతాయని పేర్కొంది. షట్‌డౌన్ ఎత్తివేత అనంతరం స్థూల దేశీయోత్పత్తి నెమ్మదిగా తిరిగి కోలుకున్నా, నష్టపోయిన సంపద మాత్రం ఇక రికవర్ కాదని పేర్కొంది. కీలకమైన బిల్లులకు సంబంధించి అధికార, విపక్ష చట్టసభ సభ్యుల మధ్య రాజీ కుదరకపోవడంతో అమెరికా ప్రభుత్వం మూతబడింది. ఇలా జరగడం ఇదే తొలిసారి కాదు. 1976 నుంచి దాదాపు 10 సార్లు షట్‌డౌన్ పరిస్థితి ఎదురైంది. 2018 డిసెంబర్ 22 నుంచి 2019 జనవరి 25 వరకు 35 రోజుల పాటు సాగిన షట్‌డౌన్ అమెరికా చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైనది. అప్పుడు కూడా డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉండటం గమనార్హం. ప్రభుత్వం మూతబడినప్పుడు, నిధులు లేకపోవడం వల్ల, కొన్ని ముఖ్యమైన విభాగాలు తప్ప, కీలకం కాని ఫెడరల్ సర్వీసులన్నీ నిలిచిపోతాయి.

# టాంజానియా అధ్యక్షురాలిగా సమియా హసన్ ఎన్నిక



**కంపాలా(ఉగాండా):** టాంజానియా అధ్యక్షురాలు సమియా సులుహు హస్సన్ అపూర్వ విజయం సాధించారు. పోలైన ఓట్లలో ఆమెకు 97 శాతానికి పైగా ఓట్లు పడ్డాయని శనివారం అధికారులు ప్రకటించారు. ఎన్నికలు వివాదాస్పదంగా మారిన వేళ అధికారులు ఈ ప్రకటన చేయడం గమనార్హం. దేశ పరిపాలనా రాజధాని డొహొమాలో జరిగిన కార్యక్రమంలో అధికారులు ఆమెను ఎన్నికల్లో విజేతగా ధ్రువీకరిస్తూ సర్టిఫికెట్ అందజేశారు. ఇటీవల జరిగిన ఎన్నికలకు ముందు రెండు ప్రధాన ప్రతిపక్ష పార్టీల నేతలను పోటీలో లేకుండా చేయడం, చిన్న పార్టీలకు చెందిన 16 మంది అభ్యర్థులను హస్సన్ ఎదుర్కోవడం తదితర అంశాల్లో ఈ ఎన్నికలపై దేశీయంగా, అంతర్జాతీయంగా విమర్శలు వెల్లువెత్తాయి. అక్టోబర్ 29వ తేదీన ఎన్నికల సమయంలో పెద్ద సంఖ్యలో జనం వీధుల్లోకి రావడంతోపాటు పోలింగ్ ప్రక్రియను అడ్డుకునేందుకు యత్నించారు. అడ్డుకోబోయిన పోలీసులు, మిలటరీతో తలపడ్డారు. ఈ ఘర్షణల్లో కనీసం 10 మంది చనిపోయినట్లు ఐరాస మానవ హక్కుల విభాగం ప్రకటించింది. అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన జాన్ పొంబె ముగుఫులి కొద్దిరోజులకే అనారోగ్యంతో చనిపోవడంతో, ఉపాధ్యక్షురాలిగా ఉన్న హస్సన్ 2021లో అధ్యక్షురాలయిన సంగతి తెలిసిందే.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | సోమవారం, హైదరాబాద్ | 03-11-2025
ANN తెలుగు

# ఒక్క ట్యాగ్.. ఎంత పనిచేసిందో?




'అర్జున్ రెడ్డి'తో తెలుగులో హిట్ కొట్టి.. తర్వాత బాలీవుడ్‌కి వెళ్లిపోయిన సందీప్ రెడ్డి వంగా.. కబీర్ సింగ్, యానిమల్ అంటూ హిందీలోనే మూవీస్ తీశాడు. ఇవి బ్లాక్ బస్టర్ హిట్ అయి వందల కోట్ల కలెక్షన్ తెచ్చుకున్నా సరే ఇతడిపై బాలీవుడ్ సెలబ్రిటీల కడుపు మంట చల్లారలేదని చెప్పొచ్చు. అవకాశం దొరికినా ప్రతిసారి ఎవరో ఒకరు విమర్శిస్తూనే ఉంటారు. వాటికి సందీప్ కూడా ఎప్పటికప్పుడు కౌంటర్స్ ఇస్తూనే ఉంటాడు. గత నెలలో ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా 'స్పిరిట్' మూవీ నుంచి ఓ వీడియో రిలీజ్ చేశారు. ఇందులో ప్రభాస్ పేరు ముందు 'ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్‌స్టార్' అని సందీప్ ప్రస్తవించాడు. ఈ ట్యాగ్ వల్ల బాలీవుడ్ గల్లంతు అయిపోయింది. అటు సల్మాన్ ఇటు షారుఖ్ ఖాన్ ఫ్యాన్స్.. మా హీరో సూపర్‌స్టార్ అంటే మా హీరో సూపర్‌స్టార్ తెగ ట్వీట్స్ పెట్టి హడావుడి చేశారు. మరోవైపు పలువురు పీఆర్స్ కూడా ప్రభాస్ కంటే సల్మాన్, షారుఖ్ తోపు అన్నట్లు రాసుకొచ్చారు. ఇదంతా జరిగి వారంపైనే అయిపోయింది. తాజాగా ఈ ట్యాగ్ విషయం మరోసారి చర్చనీయాంశమైంది. దీనికి కారణం షారుఖ్ ఖాన్ 'కింగ్' మూవీ అనౌన్స్‌మెంట్. షారుఖ్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం(నవంబరు 02) గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సిద్ధార్థ్ ఆనంద్ పెట్టిన ట్వీట్ ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఇందులో.. 'సూపర్‌స్టార్ అనే ట్యాగ్ మించిన స్టార్స్ ఉంటే వాళ్లని కింగ్ అని పిలుస్తారు. హ్యాపీ బర్త్ డే ఇండియాస్ కింగ్' అని డైరెక్టర్ సిద్ధార్థ్ ఆనంద్ రాసుకొచ్చాడు.


డైరెక్టర్ సిద్ధార్థ్ ఆనంద్ చేసిన ట్వీట్ చూస్తే కచ్చితంగా సందీప్ రెడ్డి వంగా కౌంటర్ ఇవ్వడం కోసమే ఇలా పెట్టాడా అనే సందేహం వస్తుంది. చూస్తుంటే సందీప్ రేపిన రచ్చ బాలీవుడ్‌లో ఇప్పట్లో చల్లారేలా లేదుగా అనిపించడం గ్యారంటీ. రాబోయే రోజుల్లో ఈ ట్యాగ్ గోల ఎంతవరకు వెళ్తుందో చూడాలి?



# ముచ్చటగా మూడోసారి?

జయాపజయాలతో సంబంధం లేకుండా భారీ చిత్రాల్లో ఆఫర్లను దక్కించుకుంటూ కెరీర్‌లో దూసుకుపోతున్నది అగ్ర కథానాయిక పూజాహెగ్డే. ప్రస్తుతం ఈ భామ తమిళంలో జననాయగన్, కాంచన-4 వంటి చిత్రాల్లో భాగమవుతున్నది. తాజా సమాచారం ప్రకారం పూజాహెగ్డే మరోమారు అల్లు అర్జున్‌తో కలిసి సందడి చేయనున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే... అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో ఓ సైంటిఫిక్ ఫిక్షన్ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. పునర్జన్మల నేపథ్యంలో సాగే ఫిక్షన్ చిత్రమిదని సమాచారం. దీపికా పదుకొణె కథానాయిక. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్‌కు ప్లాన్ చేస్తున్నారట. ఇందులో పూజాహెగ్డే నర్తించనుందని తెలిసింది. డీజే, అలవైకుంఠపురములో వంటి చిత్రాల ద్వారా బన్నీ, పూజాహెగ్డే సక్సెస్‌ఫుల్ కాంబినేషన్‌గా నిరూపించుకున్నారు. ఈ నేపథ్యంలో ముచ్చటగా మూడోసారి వీరిద్దరు స్క్రీన్‌షేర్ చేసుకోబోతుండటం ఆసక్తికరంగా మారింది. అయితే ఈ విషయంలో చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# తన పాత్ర కోసం 50 కిలోల బరువైన నగలు ధరించిన సోనాక్షి..



టాలీవుడ్ హీరో సుధీర్ బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న "జటాధర" సినిమా విడుదలకు సిద్ధమైంది. మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. అలాగే చాలా ఏళ్ల తర్వాత మాజీ హీరోయిన్ శిల్పా శిరోద్కర్ ఈ సినిమాతో తెలుగు తెరపై మళ్లీ సందడి చేయనున్నారు.ఈ చిత్రాన్ని వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణలో, శివిన్ నారంగ్, నిఖిల్ నందా, అరుణ అగర్వాల్, శిల్పా సింఘాల్ నిర్మిస్తున్నారు. అక్షయ్ కేజ్రీవాల్, కుసుమ్ అరోరా సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ సినిమా నవంబర్ 7న తెలుగు, హిందీ భాషల్లో గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. మూవీ ప్రమోషన్‌లో భాగంగా నవంబర్ 1న నిర్వహించిన 'జటాధర' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో సుధీర్ బాబు, శిల్పా శిరోద్కర్, దర్శకులు, నిర్మాతలు, ఇతర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యారు. "నేను నెపో కిడ్ ని కాదు. 200 రూపాయలు కట్టి జిమ్ చేసేవాళ్లం. కృష్ణగారి అల్లుడు, మహేష్ బావగా నాకు దక్కింది ఎక్స్‌ట్రా కాఫీ మాత్రమే. నా తొమ్మిదినెలల కొడుకును చేతిలో పెట్టుకుని కెరీర్ గురించి ఆలోచించా. నాకు ఆకలి బాధ తెలియదు కానీ, ముద్ద దిగకపోవడం తెలుసు. కృష్ణానగర్ కష్టాలు తెలియకపోయినా, కారులో కూర్చుని ఏడవడం నాకు తెలుసు. మహేష్‌ని ఎప్పుడూ ఏ హెల్ప్ అడగలేదు అని అన్నాడు. అదే సందర్భంగా ఆయన సహ నటీమణుల గురించి మాట్లాడుతూ .. "ఈ సినిమాలో శిల్పా గారి పెర్ఫార్మెన్స్ చూసి నేను లవ్‌లో పడ్డాను. సోనాక్షి సింహా హెల్త్ ఇష్యూల్ వల్ల ప్రమోషన్లకు రాలేదు కానీ, నిద్రపోతే కూడా ఆమె కేరెక్టర్ కలల్లోకి వస్తుంది" అన్నారు. ఇందులో సోనాక్షి లేడీ విలన్‌గా కనిపించనుండగా, ఈ పాత్ర కోసం ఏకంగా 50 కిలోల బరువైన ఆభరణాలు ధరించాల్సి వచ్చిందని తెలిపింది. తన కెరీర్‌లో అత్యంత శారీరక శ్రమతో కూడిన పాత్రల్లో ఒకటని.. ప్రతిరోజూ షూటింగ్‌కి సిద్ధమవ్వడానికి మూడు గంటలు పట్టేదని స్పష్టం చేసింది. చీరపై హార్నెస్ వేసుకుని, దాని మీదే ఆభరణాలు కుట్టి వేసేవాళ్లని.. అవి యాక్షన్ సన్నివేశాల్లో కదలకుండా ఉండేందుకు అలా కుట్టేవారని సోనాక్షి చెప్పుకొచ్చింది. అంత బరువైన ఆభరణాలతో గంటల తరబడి షూటింగ్ చేయడం చాలా కష్టంగా అనిపించినా, సినిమా కోసం చేశానంటూ ఆమె పేర్కొంది.

# ఈ అవార్డ్ నా అభిమానులకు అంకితం.. అల్లు అర్జున్ ట్వీట్



ప్రతిష్టాత్మక అవార్డ్‌ను తన అభిమానులకు అంకితమిస్తున్నానని అల్లు అర్జున్ ట్వీట్ చేశారు. ఇలాంటి అరుదైన గౌరవమిచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏడాది అవార్డులు పొందిన వారికి హృదయపూర్వక అభినందనలు చెబుతూ ఐకాన్ స్టార్ ట్వీట్ చేశారు. 2024 ఏడాదిగానూ ప్రకటించిన దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డులను తాజాగా ప్రకటించారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డుల్లో మోస్ట్ వర్సటైల్ యాక్టర్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికయ్యారు. అంతేకాకుండా పుష్ప2 మూవీకి గానూ ఉత్తమ సంగీత దర్శకుడిగా దేవీశ్రీ ప్రసాద్ అవార్డ్ దక్కించుకున్నారు. ఈ అవార్డ్స్‌లో ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీ సినిమా సత్తా చాటింది. దాదా సాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2025లో ఫిల్మ్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచింది. గతేడాది విడుదలై ప్రేక్షకుల్ని భయంతో పరుగులు పెట్టించిన శ్రద్ధాకపూర్ మూవీ స్త్రీ 2 ఉత్తమ చిత్రంగా అవార్డును దక్కించుకుంది. దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డ్స్‌లో ఉత్తమ నటీనటులుగా కార్తీక్ ఆర్యన్, కృతి సనన్ నిలిచారు. చందు ఛాంపియన్ చిత్రానికి గానూ ఉత్తమ దర్శకుడిగా కబీర్ ఖాన్, ప్రొడ్యూసర్ ఆఫ్ ది ఇయర్‌గా దినేశ్ విజన్ అవార్డులు సొంతం చేసుకున్నారు. క్రిటిక్స్ విభాగంలో ఉత్తమ చిత్రంగా లాపత్తా లేడీస్, ఉత్తమ నటీనటులుగా విక్రాంత్ మాస్సే, నితాన్షీ గోయెల్ అవార్డులు దక్కించుకున్నారు. ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్‌గా ఏఆర్ రెహమాన్ నిలిచారు.

# రూ.40 కోట్ల క్లబ్‌లో కిరణ్ అబ్బవరం కె ర్యాంప్



దీపావళి పండుగ కానుకగా విడుదలైన కిరణ్ అబ్బవరం 'కె ర్యాంప్' చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. ఇప్పటికే బ్రేక్ ఈవెన్‌ను పూర్తి చేసుకుని దూసుకుపోతున్న ఈ చిత్రం తాజాగా రూ.40 కోట్ల క్లబ్‌లో చేరినట్లు చిత్రబృందం ప్రకటించింది. తొలిసారిగా మెగా ఫోన్ పట్టిన డెబ్యూ డైరెక్టర్ జైన్స్ నాని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్, ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా యువతరం ఈ చిత్రాన్ని చూసేందుకు థియేటర్లకు క్యూ కడుతున్నారు. చిత్ర విజయం పట్ల సోషల్ మీడియాలో కిరణ్ అబ్బవరం ఫ్యాన్స్ హర్షం వ్యక్తం చేస్తూ, ఈ విజయాన్ని ఉత్సవంలా జరుపుకుంటున్నారు. ఈ సినిమాలో యూక్తి తరేజా కథానాయికగా నటించగా.. రాజేశ్ దండా ఈ సినిమాను నిర్మించాడు. సాయి కుమార్, నరేష్ కీలక పాత్రలో నటించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. కుమార్ (కిరణ్ అబ్బవరం) పుట్టుకతోనే సంపన్నుడు. తండ్రి కృష్ణ (సాయికుమార్) అతి గారబంతో సర్వం సమకూర్చుతాడు. కానీ కుమార్ కి చదువు పట్టదు. పైగా ఎప్పుడూ డ్రింక్ చేస్తూ ఉంటాడు. తనని దారిలో పెట్టాలని కేరళలోని ఓ కాలేజ్‌లో చేర్చుతారు. అక్కడ మెర్సీ జాయ్ (యుక్తి తరేజా)ని చూసి తొలి చూపులోనే ప్రేమలో పడిపోతాడు కుమార్. అయితే మెర్సీకి ఓ మానసిక సమస్య వుంటుంది. ఆ సమస్య ఏమిటి? దానికి కారణంగా ఈ ప్రేమకథ ఎలాంటి మలుపు తిరిగిందనేది మిగతా కథ.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com